Follow: @ANNTELUGU
25-05-2026

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 147 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## వెనక్కు తగ్గిన ఇరాన్

- అమెరికాతో డీల్ దాదాపు ఫైనల్
- తెరుచుకోనున్న హార్ముజ్ జలసంధి
- సూత్రప్రాయ అంగీకారం



**మహా :** అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధ వాతావరణాన్ని తగ్గించి, శాంతిని నెలకొల్పే దిశగా కీలక ఒప్పందం దాదాపు ఖరారైనట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. 60 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ , హోర్ముజ్ జలసంధి పునరుద్ధరణ, ఇరాన్ అణు కార్యక్రమాల నియంత్రణపై చర్చలు ఈ ప్రతిపాదిత ఒప్పందంలో ప్రధానాంశాలుగా ఉన్నాయి. ఇరాన్ వెనక్కు తగ్గడంతో అమెరికా డీల్ ను ఫైనల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా ఇరాన్ దిగ్బంధించిన ప్రపంచ కీలక చమురు రవాణా మార్గమైన 'హోర్ముజ్ జలసంధి 'ను ఎలాంటి టోల్ ఫీజులు

మిగిత 2వ పేజీలో

## టాప్ న్యూస్

### విజయ్ సర్కార్ మా దయా దాక్షిణ్యాలపైనే

- మాజీ సీఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు
- తమిళ ప్రజలు డీఎంకేను వెతుక్కుని వచ్చి గెలిపిస్తారు



02

### బీహార్ బైపోల్ బరిలో పీకే?

- నితిన్ నబిన్ రాజీనామాతో ఖాళీ అయిన బంకీపూర్ అసెంబ్లీ స్థానంలో పోటీ



02

### ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు ఎత్తివేయండి

- ఏపీ సర్కార్ కు హరీష్ రావు సూచన



02

## కేటీఆర్‌కు ఏం తెలుసని మాట్లాడుతున్నారు?

- మంత్రి ఉత్తమ్ ఫైర్
- రాజకీయం తప్ప నిజాలు పట్టవా?



హైదరాబాద్, మహా : కేటీఆర్ తెలిసీతెలియని మాటలు మాట్లాడుతున్నారని, కేటీఆర్ కు వరి ధాన్యం గురించి ఏం తెలుసు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎంత దిగుబడి వస్తుంది.. ఎలా కొనాల నేది ఆయనకు తెలియదన్నారు. రాజకీయాలు చేయడం తప్పితే వారికి వాస్తవాలు తెలియదని దుయ్యబట్టారు. ఇవాళ ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన మంత్రి.. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనిలో ఉందన్నారు. తాము చేసింది చెప్పుకోలేక పోతున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో హమాలీల కొరతతో కొంత ఇబ్బంది పడ్డామని ఇప్పుడు సెట్ అయిందన్నారు. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశామని ఇందుకోసం సుమారు రూ. 9 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. మిగిలిన 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందని దీన్ని వారం రోజుల్లో సేకరించాలని కలెక్టర్లను ఆదేశించామన్నారు.

జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

## కేటీఆర్ పిలుపు



**హైదరాబాద్:** బీఆర్ఎస్ కార్యకర్తలు జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం అంబర్‌పేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పాలనను కాంగ్రెస్ గాలికొది లేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు పీకల్లోతు కోపం ఉందని, హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారన్నారు. ఉన్న సిటీనే సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, ఇలాంటి నాయకుడు ఫ్యూచర్ సిటీ ఎలా నిర్మిస్తారన్నారు. బీఆర్ఎస్‌లో పనిచేసే వారికే గుర్తింపు ఉంటుదని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సర్వేల ఆధారంగానే టికెట్లు ఇస్తామన్నారు. బీఆర్ఎస్‌లో పని చేసేవారికే గుర్తింపు ఉంటుందని, రాష్ట్రంలో ఎప్పుడూ ఎన్నికలు జరిగిన బీఆర్ఎస్‌దే గెలుపని, డిసెంబర్ లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరుగుతాయన్నారు. సర్వేల ఆధారంగానే టికెట్లు ఇస్తామని, ఎస్ఐఆర్‌పై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.



# అత్వెల్లి లో మైల్ స్టోన్ బరితెగింపు

### అక్రమార్కుల చెరలో చిక్కిన పెద్ద చెరువు నాలాలు, అలుగు

- కల్వర్ట్ ల మధ్య వెంచర్ కమాన్ నిర్మాణం
- నోట్ల కట్టలతో నోళ్లు మూయించిన రియల్టర్లు
- కోట్లు మింగి లేఅవుట్‌కు అనుమతులు జారీ చేసిన హెచ్ ఎండీఏ
- రెవెన్యూ, ఇరిగేషన్ జాయింట్ సర్వే రిపోర్ట్‌లో ఎన్నో అనుమానాలు..
- మైల్ స్టోన్ లే అవుట్ లో ప్లాట్లు కొంటే పాట్లేనా ?

**ఇరిగేషన్, రెవెన్యూ హెచ్ ఎం డీ ఏ లలో పనిచేస్తున్న కొందరు అవినీతి అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఎన్వోసీలు, నిర్మాణ అనుమతులు జారీ చేసి కోట్లరూపాయిలు కొల్లగొడుతున్నారు.. అవినీతి అధికారుల ధన దాహానికి చెరువులు, కుంటలు, నాలాలు, అలుగులు మటు మాయమౌతున్నాయి.. మేడ్చల్ సర్కిల్ పరిధి అత్వెల్లిలో మైల్ స్టోన్ అనే కార్పొరేట్ నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిన లే అవుట్ కు జారీ చేసిన అనుమతులే ఇందుకు నిలువెత్తు నిదర్శనం.. చెరువు అలుగు, నాలాలను రియల్ మాఫియాకు తెగనమ్మి ఇరిగేషన్ అధికారులు ఎన్వోసి జారీ చేస్తే... కోట్లు మింగి హెచ్ ఎండీఏ అధికారులు లే అవుట్ పర్మిషన్లు ఇచ్చారని స్థానికంగా బహిరంగ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. అత్వెల్లి కేంద్రంగా రియల్టర్లు సాగిస్తున్న అక్రమ దందా పై మహా, ఏ ఎన్ ఎన్ అందిస్తున్న ప్రత్యేక కథనం..**

**హైదరాబాద్, మహా స్పెషల్ టాస్క్‌ఫోర్స్**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధి అత్వెల్లిలో రియల్ మాఫియా అరాచకం రాజ్యమేలుతోంది. కట్టమైసమ్మ తల్లి సాక్షిగా మైల్ స్టోన్ కార్పొరేట్ సంస్థకు పెద్ద చెరువు అలుగు నాలాలను తెగనమ్మి ఇరిగేషన్ అధికారులు ఎన్వోసీ జారీ చేశారు. అదే బాటలో రియల్టర్లు హెచ్ఎండీఏ అధికారులకు రూ.కోట్లు కుమ్మరించి లేఅవుట్ పర్మిషన్లు పొందడం వారి అవినీతి అక్రమాలకు అద్దం పడుతోంది. వాస్తవంగా హెచ్ఎండీఏ లీగల్ టీం క్షేత్రస్థాయిలో లేఅవుట్‌ను పరిశీలించి ప్రభుత్వ భూములు చెరువులు, నాలాలు, కుంటలు లేవని నిర్ధారించి లేఅవుట్ అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది. కానీ రియల్ మాఫియా విసిరే కాసులకు కక్కుర్తి పడి అడ్డదారులు తొక్కుతూ లేఅవుట్ అనుమతులు జారీ చేశారని స్థానిక ప్రజలు

మిగితా 2వ పేజీలో

## మెరిట్ పక్కనపెట్టి టార్గెట్ల వైపు

### ఆన్‌లైన్ యుగంలో ఇంటింటి ప్రచారం

- మైనారిటీ గురుకులాల విలక్షణ వైఖరి
- సంక్షేమ గురుకులాల్లో అడ్మిషన్ల సంక్షోభం




## ఇంధన ధరల నియంత్రణ మోదీ ఘనతే

- కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు.
- ఖమ్మం గడ్డపై కాషాయ జెండా ఎగరేయండి.
- ఖమ్మంలో బిజెపి చీఫ్ రామచంద్ర రావు

02



## పర్యాటక రంగంలో.. పెట్టుబడులు పెట్టండి

**మంత్రి జూపల్లి పిలుపు**



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని టూరిజం శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో పర్యాటక ప్రాజెక్టులను వేగవంతం చేస్తామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ లో భాగంగా పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల ప్రోత్సాహకాలు ఇస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) ప్రాంగణంలో శనివారం డెస్టినేషన్ తెలంగాణ - రోడ్ అహెడ్ పేరిట నిర్వహించిన పర్యాటక సదస్సుకు ఆయన చీఫ్‌గెస్ట్‌గా హాజరయ్యారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతిపాదనలతోపాటు డీపీఆర్ సమర్పిస్తే, జాప్యం లేకుండా అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎంపికైన సంస్థలకు డిజైన్లు, ప్రాజెక్ట్ అంచనాల వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. కొన్ని పర్యాటక ప్రాంతాల్లో వసతుల ఏర్పాటుకు ప్రైవేట్ వ్యక్తులు ముందుకు రావాలని, వారికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రజింత్ నాయక్, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



# అత్వేల్లి లో మైల్ స్టోన్ బరితెగింపు

( మొదటి పేజీ తరువాయి )

బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ చట్టాల ప్రకారం సహజ సిద్ధంగా ప్రవహించే నీటి ప్రవాహాన్ని మళ్లించటం, అడ్డుకట్టలు వేయడం నేరం. అయిన ప్పటికటీ చట్టాలను అవినీతి అధికారులు తమ చుట్టాలుగా మార్చుకుని విచ్చలవిడిగా ఎన్వోసీలు ఇవ్వడం వారి అవినీతి అక్రమాలకు పరాకాష్టగా నిలుస్తోంది. 165 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు నిండినప్పుడు అలుగు, తూము, నాలాల ద్వారా మైల్ స్టోన్ లేఅవుట్ మధ్య నుంచి ప్రవహించి దిగువ ప్రాంతాన ఉన్న వందల ఎకరాల పంట పొలాలకు సాగునీటిని అందిస్తుందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. అలుగు, నాలాలు, తూములు మూయటంతో రాబోయే వర్షాకాలంలో చెరువు నిండితే అలుగు, నాలాల ద్వారా ప్రవహించే నీరు ఎటు పోతుందని స్థానిక ప్రజలు ఇరిగేషన్ అధికారులను సూటిగా ప్రశ్నిస్తున్నారు. చెరువులు, నాలాలు, కుంటలు పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం వందల కోట్ల రూపాయలను వెచ్చించి చర్యలు చేపడుతోంది. కానీ కాసులకు కక్కుర్తి పడి కొందరు అవినీతి అధికారులు అడ్డదారులు తొక్కుతూ ఎంతో విలువైన ప్రజల సంపదను రియల్ మాఫియాకు ధారాదత్తం చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



లే అవుట్ నిర్మాణం



165 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అత్వేల్లి పెద్ద చెరువు

## ప్రీలాంచింగ్ పేరుతో అక్రమ దందా

మైల్ స్టోన్ డెవలపర్స్ యాజమాన్యం ప్రీలాంచింగ్ పేరుతో అక్రమ దందాకు తెగబడుతోంది. రంగు రంగు బ్రోచర్లు, రక రకాల ప్రకటనలతో మాయ చేసి అమాయకులకు అంతగట్టు సొమ్ము చేసుకొంటోంది. 80 ఎకరాల లే అవుట్ లో 10శాతం గ్రీన్ బెల్ట్ స్థలం అనగా 8 ఎకరాల స్థలాన్ని మౌళిక సదుపాయాల కోసం కేటాయించాల్సి ఉంటుంది. లే అవుట్ నిర్మాణం పూర్తి కాకుండానే గాల్లో విక్రయాలు జరుపుతూ రియల్ మాఫీయా కోట్ల రూపాయలు కొల్ల గొడుతోందని బహిరంగ ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. లే అవుట్ కమాన్ కు ఇరువైపుల ఉదృతంగా ప్రవహిస్తోన్న నాలాలు వ్యవహారంలో జరిగిన కుంభకోణంలో ఇరిగేషన్ జారీ చేసిన ఎన్ ఓ సి, హెచ్ఎండీఏ ఇచ్చిన లే అవుట్ అనుమతులు రద్దు చేయాలని న్యాయ స్థానాలను ఆశ్రయిస్తే కొనుగోలు దారుల పరిస్థితి ఏంటి..? అనే సందేహాలు ఉత్పన్నామౌతున్నాయి.రూపాయి, రూపాయి కూడపెట్టి గజం రు 40 వేలు పెట్టి కొనుగోలు చేసిన కొనుగోలు దారుడు నడి రోడ్డు మీద పడినట్టేనా..?ఏది ఏమైనా మైల్ స్టోన్ లో ప్లాట్లు కొంటే పాడరాని అగచాట్లు పడాల్సి ఉంటుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.





**నాలాల దురక్రమణ :** అత్వేల్లి పెద్ద చెరువు విస్తీరణ 165 ఎకరాలుగా ఇరిగేషన్ రికార్డుల బట్టి తెలుస్తోంది.దిగు వ ప్రాంతాన ఉన్న పంట పొలాలకు మూడు నాలాల నుండి నీరు ప్రవహిస్తోంది. అందులో రెండు నాలాలు మైల్ స్టోన్ వెంచర్ నుండి ఒక నాలా సుమారు 300మీటర్లు, రెండవ నాలా 150 మీటర్ల వెడల్పుతో ప్రవహిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మైల్ స్టోన్ యాజమాన్యం అవినీతి అధికార్లకు కాసులు వెదజల్లటంతో ఇరిగేషన్ చట్టాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యాంగా ఎన్వొసి జారీ చేశారని, దాంతో హెచ్ఎండీఏ అధికారులు కళ్లు మూసుకొని వెంచర్ కు అనుమతులు ఇవ్వటంపై తీవ్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.. గత ఇదేళ్లుగా నాలాల కారణంగా ఆగిన లే అవుట్ పర్మిషన్ లు ఇప్పుడు ఎలా వస్తాయిని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మైల్ స్టోన్ డెవలఫర్స్ వేస్తున్న 80ఎకరాల వెంచర్ లో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ ఎస్సైండ్ ల్యాండ్ ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ యంత్రాంగం స్పందించి క్షేత్ర స్థాయిలో సర్వే జరిపి వాస్తవాలు రాబట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి నాలాల ఆక్రమణకు తెగబడ్డ రియల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## విజయ్ సర్కార్మా దయాదాక్షిణ్యాలపైనే

**చెన్నై, మహా :** డీఎంకే అధినేత , తమిళనాడు మాజీ సీఎం ఎంకే స్టాలిన్ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విజయ్ ప్రభుత్వం ఐదేళ్ల పూర్తికాలం అధికారంలో కొనసాగలేదని, ఇప్పుడు అది డీఎంకే దయాదాక్షిణ్యాలపైనే నడుస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలను ఒక రాజకీయ ప్రభంజనంగా తాను భావించడం లేదని, ఇదొక 'సినిమా సునామీ' మాత్రమేనని స్టాలిన్ అభివర్ణించారు. ఓటర్లు ఎలాంటి రాజకీయ విశ్వాసాన్నిగానీ, సిద్ధాంతాలనుగానీ చూసి టీవీకే పార్టీకి ఓటు వేయలేదని, కేవలం ఒక ప్రముఖ స్టార్ నటుడు పార్టీ పెట్టాడనే ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు తెలిపారని అన్నారు. పిల్లలకు కొత్తగా ఆడుకునేందుకు ఒక ఆటవస్తువు దొరికితే ఎంత ఉత్సాహం చూపిస్తారో, ఇదీ అలాంటిదేనని.. కొన్ని రోజుల్లోనే ఆ ఆటవస్తువుపై ప్రజలకు ఆసక్తి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్టు, తమిళనాడు ఓటర్లు త్వరలోనే మళ్లీ డీఎంకే కోసం వెతకడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

# వెనక్కు తగ్గిన ఇరాన్

( మొదట పేజీ తరువాయి )

లేకుండా 60 రోజుల పాటు తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. అక్కడ తాము అమర్చిన మైన్లను కూడా ఇరాన్ తొలగించనుంది. దీనికి ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఉన్న దిగ్బంధనాన్ని ఎత్తివేస్తూ, ఇరాన్ స్వేచ్ఛగా చమురు అమ్ముకునేందుకు కొన్ని ఆంక్షల నుంచి మినహాయింపులు ఇవ్వనుంది. తమ వద్ద ఉన్న అత్యంత సంపన్నమైన యురేనియం నిల్వలను వదులుకోవడానికి, అలాగే అణు కార్యక్రమాలను నిలిపివేయడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. అయితే, దీనిపై ఇరాన్ అధికారిక వర్గాలు కొంత భిన్నమైన ప్రకటనలు చేస్తున్నాయి.

**అణు నిల్వల అప్పగింత అంశం ఇపుడే కాదు**

మరోవైపు, ఈ ఒప్పందంపై అంతర్జాతీయ వార్తా సంస్థ 'రాయిటర్స్' ప్రచురించిన కథనం ఒక కొత్త మలుపును తీసుకొచ్చింది. దీని ప్రకారం తమ వద్ద ఉన్న అత్యంత సంపన్నమైన యురేనియం నిల్వలను వేరే దేశానికి అప్పగించడానికి లేదా దేశం దాటించడానికి ఇరాన్ ఎలాంటి అంగీకారం తెలపలేదని ఆ దేశ సీనియర్ అధికారి స్పష్టం చేశారు. ప్రస్తుతం అమెరికాతో జరుగుతున్నది ప్రాథమిక ఒప్పందం మాత్రమేనని, ఇందులో అణు సమస్యల ప్రస్తావన లేదని ఆయన పేర్కొన్నారు. అణు నిల్వలపై తుది నిర్ణయం, చర్చలు అన్నీ కూడా రాబోయే తుది ఒప్పందంలో మాత్రమే భాగమవుతాయని, ప్రస్తుత తాత్కాలిక ఒప్పందంలో దీనికి చోటు లేదని ఇరాన్ స్పష్టం చేసింది.హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణ: ఇరాన్ మద్దతు ఉన్న లెబనాన్ ఉగ్రవాద సంస్థ హెజ్‌బొల్లా, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధానికి కూడా ఈ ఒప్పందం ద్వారా తాత్కాలిక విరామం లభించనుంది.

### ఇజ్రాయెల్ ఆందోళనలు

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ ఒప్పందంపై, ముఖ్యంగా హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణ అంశంపై ట్రంప్‌తో మాట్లాడి తన ఆందోళనలను వ్యక్తం చేశారు. అయితే, హెజ్‌బొల్లా తిరిగి ఆయుధాలు సమకూర్చుకున్నా లేదా దాడులు చేసినా ఇజ్రాయెల్‌కు ఎదురు దాడి చేసే పూర్తి హక్కు ఉంటుందని అమెరికా భరోసా ఇచ్చింది. ఈ విషయమై చర్చించేందుకు నెతన్యాహు అత్యవసర భద్రతా క్యాబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్న చమురు సంక్షోభాన్ని నివారించేందుకు ట్రంప్ అవలంబిస్తున్న వ్యూహంలో భాగంగా ఈ ఒప్పందం తెరపైకి వచ్చింది. ఇరాన్ నిబంధనలను పాటిస్తేనే పూర్తి ఆంక్షల తొలగింపు ఉంటుందని అమెరికా స్పష్టం చేస్తోంది.

**ప్రాంతీయ దేశాల**

**మద్దతు - పాకిస్థాన్ మధ్యవర్తిత్వం**

ఈ శాంతి ప్రయత్నాల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రాంతీయ దేశాల నాయకులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో సౌదీ అరేబియా, ఖతార్, ఈజిప్ట్, టర్కీ, యూఏఈలతో పాటు మధ్యవర్తిత్వానికి నాయకత్వం వహిస్తోన్న పాకిస్థాన్ కూడా పాల్గొంది. శాంతి స్థాపనకై ట్రంప్ చేస్తున్న కృషిని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అభినందించారు.

# మెరిట్ పక్కనపెట్టి టార్గెట్ల వైపు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో పేద, వెనుకబడిన,అణగారిన వర్గాల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉచిత నివాస విద్యా సౌకర్యాలను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గురుకుల విద్యాలయాలను స్థాపించింది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రధాన సొసైటీల పరిధిలో విస్తరించి ఉన్న వెయ్యికి పైగా విద్యాసంస్థలు నేడు ఐదు లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ దేశంలోనే ఒక నూతన విద్యా విప్లవానికి నాంది పలికాయి. అయితే, ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభ వేళ ఈ అద్భుతమైన విద్యా వ్యవస్థలోని ఒక కీలక విభాగంలో తీవ్రమైన అసంతృప్తి, ఆందోళన వ్యక్తమవుతుండటం గమనార్హం. మిగతా అన్ని గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియ అత్యంత సులువుగా, సాంకేతికంగా, వ్యవస్థీకృతంగా సాగిపోతుంటే, మైనారిటీ గురుకులాల్లో మాత్రం ఉపాధ్యాయులను క్షేత్రస్థాయిలోకి నెట్టి అడ్మిషన్ల వేట సాగించడం తీవ్ర వివాదానికి దారితీస్తోంది. విద్యాబోధనతో సమాజంలో అత్యున్నత గౌరవాన్ని పొందే ఉపాధ్యాయులను ఈ భానుడి భగభగల్లో రోడ్లపైకి పంపి ఇంటింటికీ తిప్పడం గురుకులాల ప్రతిష్టకే సవాలుగా మారుతోంది




తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న మొత్తం 1,023 సంక్షేమ గురుకుల పాఠశాలలు , కళాశాలలు అత్యంత విజయవంతంగా నడుస్తున్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకులాలు 320కి పైగా సంస్థలతో ఒక లక్షా డెబ్బై వేల మంది విద్యార్థులకు ఆసరాగా నిలిచి రాష్ట్రంలోనే అతిపెద్ద సొసైటీగా అవతరించింది. అలాగే సాంఘిక సంక్షేమ గురుకులాలు 268 విద్యాసంస్థల ద్వారా లక్షా యాభై ఐదు వేల మందికి, గిరిజన సంక్షేమ గురుకులాలు 165 సంస్థల ద్వారా సుమారు ఎనభై వేల మందికి, సాధారణ గురుకులాలు 35 సంస్థల ద్వారా ఇరవై వేల మందికి విద్యాదానం చేస్తున్నాయి. ఈ విస్తృతమైన గురుకుల వ్యవస్థలో మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ పరిధిలో రెండు వందల నాలుగు (204) పాఠశాలలు మరియు అప్‌గ్రేడెడ్ జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. ప్రస్తుతం ఈ సంస్థలలో దాదాపు ఒక లక్షా ముప్పై వేల (1,30,000) మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. తెలంగాణలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు జనరల్ గురుకుల సొసైటీలలో ప్రవేశాల కోసం ప్రభుత్వం అత్యంత పారదర్శకమైన, ఆధునిక ఆన్‌లైన్ ప్రవేశాల ద్వారా (ఎంట్రన్స్ ఎగ్జామ్స్) విధానాన్ని దశాబ్దాలుగా అమలు చేస్తోంది. ఈ సొసైటీలలో ఐదో తరగతి లేదా ఇంటర్మీడియట్‌లో ఒక్క సీటు సాధించాలన్నా విద్యార్థులు రాష్ట్రస్థాయి మెరిట్ సాధించాల్సిందే, అందుకే అక్కడ సీట్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొంటుంది. కానీ, దీనికి పూర్తిగా భిన్నంగా మైనారిటీ గురుకులాల్లో మాత్రం ఎటువంటి కఠినమైన ప్రవేశ పరీక్షలు నిర్వహించకుండా, కేవలం దరఖాస్తుల ఆధారంగా లేదా నేరుగా సీట్లు కేటాయించే పద్ధతిని అనుసరిస్తున్నారు. మిగతా అన్ని చోట్లా ఆన్‌లైన్ ద్వారానే వేలాది మంది దరఖాస్తు చేసుకుని సీట్లు పొందుతుంటే, మైనారిటీ విద్యాసంస్థల్లో మాత్రం అడ్మిషన్ల కోసం సిబ్బంది నేరుగా ప్రజల వద్దకు వెళ్లాల్సి రావడం వ్యవస్థలోని భిన్నత్వాన్ని ఎత్తిచూపుతోంది.

మిగతా గురుకులాల వలె ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు పెట్టకుండా ఉపాధ్యాయులను ఇంటింటికీ పంపి అడ్మిషన్లు సేకరించడం వెనుక ఉన్న అసలు అంతర్యాన్ని పరిశీలిస్తే మైనారిటీ సమాజంలో ఉన్న విద్యా, సాంకేతిక వెనుకబాటుతనం స్పష్టమవుతుంది. సచార్ కమిటీ , సుధీర్ కమిషన్ వంటి ఉన్నతస్థాయి నివేదికల ప్రకారం మైనారిటీలలోని నిరుపేద వర్గాలు నేటికీ డిజిటల్ విప్లవానికి దూరంగా, పట్టణ మురికివాడల్లో మరియు మారుమూల ప్రాంతాల్లో జీవిస్తున్నారు. వీరికి ఆన్‌లైన్ దరఖాస్తులపై కానీ, ప్రవేశ పరీక్షల షెడ్యూల్స్‌పై కానీ కనీస అవగాహన ఉండటం లేదు. ఒకవేళ ఇక్కడ కూడా కేవలం ఆన్‌లైన్ పరీక్షలనే నమ్ముకుంటే, ప్రైవేట్ కోచింగ్‌లు ఇప్పించగల ఆర్థిక స్తోమత ఉన్న అభ్యర్థులకే సీట్లు దక్కి, నిజమైన నిరుపేద మైనారిటీ పిల్లలకు అన్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ దరఖాస్తు రహిత విధానాన్ని ఎంచుకుంది.

అయితే ఈ సామాజిక అవసరాన్ని పరిపాలనాపరంగా ఒక క్రమపద్ధతిలో నిర్వహించకుండా, అధికారులు దానిని ఉపాధ్యాయులపై బలవంతపు విధిగా మార్చడం వెనుక బలమైన బడ్జెట్ సమీకరణాలు కూడా దాగి ఉన్నాయి. ప్రతి ఏటా 204 మైనారిటీ గురుకులాల నిర్వహణ కోసం ప్రభుత్వం వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని బడ్జెట్ ద్వారా కేటాయిస్తోంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గితే ఆయా విద్యాసంస్థల ఉనికి ప్రశ్నార్థకమవడమే కాకుండా, బడ్జెట్ నిధుల దుర్వినియోగంపై ఆర్థిక శాఖ మరియు ప్రతిపక్షాల నుండి తీవ్ర విమర్శలు వస్తాయి. ఈ నూతన గురుకులాలకు పాత సంస్థల వలె దశాబ్దాల చరిత్ర లేకపోవడం వల్ల, ప్రైవేట్ మదరసాలు లేదా ఇతర ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్లే విద్యార్థులను ఆకర్షించి ప్రభుత్వ సంస్థల సీట్లను వంద శాతం భర్తీ చేయాలని, తద్వారా తమ ఉనికిని చాటుకోవాలని అధికారులు ఈ డోర్ టూ డోర్ క్యాంపెయినింగ్ విధానాన్ని ఒక రక్షణ కవచంగా వాడుకుంటున్నారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఎండల తీవ్రత విపరీతంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అడ్మిషన్లు తీసుకురావాలంటూ ఉన్నతాధికారులు ఉపాధ్యాయులపై మానవతా రహితంగా ఒత్తిడి తెస్తున్నారు. రోజువారీగా జూమ్ సమావేశాలను నిర్వహిస్తూ, నిర్దేశిత టార్గెట్లు రీచ్ కాకపోతే జీతాలు నిలిపివేస్తామని, సస్పెండ్ చేస్తామని బెదిరిస్తుండటం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. ఈ విద్యా వ్యవస్థను నడిపిస్తున్న దాదాపు ఆరు వేల మందికి పైగా మైనారిటీ గురుకుల బోధనా సిబ్బందిని విద్యాబోధనకు దూరం చేసి, అడ్మిషన్ ఏజెంట్లుగా మార్చడం వల్ల విద్యార్థుల విద్యా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. కేవలం సంఖ్యను చూపించడం కోసం చదువుపై ఆసక్తి లేని వారిని కూడా బలవంతంగా చేర్పించడం వల్ల, ఆ తర్వాత తరగతి గదుల్లో వారిని నియంత్రించడం ఉపాధ్యాయులకు మరో పెద్ద సవాలుగా మారుతోంది. ఈ అప్రజాస్వామిక విధానాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాలు, ప్రిన్సిపాళ్ల సంఘాలు మరియు అధ్యాపకుల సంఘాలు ఏకతాటిపైకి వచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఈ వడగాల్పుల్లో తిరగడం వల్ల ఉపాధ్యాయుల ఆరోగ్యం క్షీణిస్తోందని, తక్షణమే ఈ ఒత్తిడి పూరిత జూమ్ మీటింగులను, సస్పెన్షన్ హెచ్చరికలను మరియు బలవంతపు అడ్మిషన్ల ప్రక్రియను నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మిగతా అన్ని గురుకుల సొసైటీల లాగే మైనారిటీ గురుకులాల్లో కూడా పారదర్శకమైన ఆన్‌లైన్ నోటిఫికేషన్లు, అధికారిక ప్రచారం, మరియు లాటరీ లేదా మెరిట్ పద్ధతి ద్వారా సీట్లు భర్తీ చేసే శాశ్వత సంస్కరణలను ప్రభుత్వం తీసుకురావాలి. అప్పుడే ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కాపాడబడుతుందని, మైనారిటీ విద్యార్థులకు కూడా నిజమైన, నాణ్యమైన విద్యాఫలాలు అందుతాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# ఇంధన ధరల నియంత్రణ మోదీ ఘనతే

ఖమ్మం, మహా: అంతర్జాతీయంగా చమురు సంక్షోభం వెంటాడుతున్నా దేశంలో ఇంధన ధరలను అదుపులో ఉంచిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్‌దేనని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణను వంతులవారీగా కొల్లగొడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటేనని, కాళేశ్వరం సీబీఐ విచారణ పేరుతో ఈ రెండు పార్టీలు చీకటి ఒప్పందాలకు తెరలేపాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరావు అధ్యక్షతన జరిగిన జరిగిన ప్రశిక్షణ తరగతుల అనంతరం. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం తెలంగాణకు రూ.10 లక్షల కోట్ల నిధులిచ్చినా కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని, రైతాంగ సంక్షోభాన్ని పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఇరాన్‌అమెరికా ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచ చమురు మార్కెట్ తీవ్ర ఒత్తిడికి గురైందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ అవసరాలకు కేవలం 10 శాతం మాత్రమే సొంతంగా క్రూడ్ ఆయిల్ లభిస్తోందని, మిగిలిన 90 శాతానికి ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, యూరప్ దేశాల్లో 15 నుండి 26 శాతం, ఐర్లాండ్‌లో 28 శాతం, చివరికి పాకిస్థాన్‌లో 54 శాతం వరకు ఇంధన ధరలు పెరిగినా, భారత్‌లో మాత్రం కేవలం రూ.3 మేరకే పెంపు జరిగిందని గుర్తుచేశారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందుచూపునకు, వ్యూహాత్మక ఇంధన భద్రతకు నిదర్శనమని కొనియాడారు. అయితే దేశంలో స్వల్పంగా ధరలు పెరగడాన్ని సాకుగా చూపుతూ కాంగ్రెస్, ఇండీ కూటమి, బీఆర్ఎస్ పార్టీలు బాధ్యతారహితంగా రాజకీయ లాభాల కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మండిపారు. గత యూపీఏ ప్రభుత్వం ఆయిల్ బాండ్ల పేరిట చేసిన లక్షల కోట్ల అప్పుల భారాన్ని భవిష్యత్తు తరాలపై నెట్టివేసిందని, ఆ ఆర్థిక దుర్వినియోగాన్ని దేశం ఇప్పటికీ భరిస్తోందని ఆరోపించారు.

తెలంగాణ రాజకీయాలపై విరుచుకుపడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని, ఇవి సమాజాన్ని వంతులవారీగా కొల్లగొడుతున్న దొంగల ముఠాలుగా మారాయని రామచంద్రరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటే, ఈ రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఆ లోటును భర్తీ చేస్తూ ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా కొల్లగొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద అవినీతి కుంభకోణమైన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న సీబీఐ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. పూర్తి స్థాయి విచారణ జరపకుండా, కేవలం కొన్ని చిన్నపాటి సాంకేతిక విషయాలను మాత్రమే సీబీఐకి అప్పగించి అసలు దోషులను, బీఆర్ఎస్ పెద్దలను రక్షించే ప్రయత్నం చేస్తోందని, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ మధ్య ఉన్న చీకటి ఒప్పందాలకు ఈ తూతూమంత్రపు విచారణే నిదర్శనమని కుండబద్దలు కొట్టారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్న కాంగ్రెస్ పాలకులకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు సుమారు రూ.10 వేల కోట్లకు పైగా పేరుకుపోయాయని, పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో బీజేపీ పాత్ర కీలకమైనదని, దివంగత సుష్మాస్వరాజ్ పార్లమెంటులో బిల్లుకు మద్దతు ఇవ్వకపోతే తెలంగాణ సాధ్యమయ్యేదా అని ప్రశ్నించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని వ్యవసాయ రంగం, రైతాంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభంపై ఆయన అత్యంత ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు సకాలంలో తెరవకపోవడం వల్ల వరి, మొక్కజొన్న పండించిన అన్నదాతలు ఐకేపీ కేంద్రాల వద్ద వారాల తరబడి కన్నీరు పెడుతూ పడిగాపులు కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లు యజమానులు, ఐకేపీ నిర్వాహకులు తేమ, తాలు పేరుతో క్వింటాళ్లకు కిలోల కొద్దీ అక్రమ తరుగు తీస్తూ దోచుకుంటున్నా పాలకులు కంటినిండా నిద్రపోతున్నారని విమర్శించారు. దళారుల చేతుల్లో మొక్కజొన్న రైతులు విలవిలలాడుతున్నా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదని, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేయడం వల్లే ఆయిల్ పామ్, వరి, పత్తి పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. తక్షణమే పూర్తి స్థాయిలో రుణమాఫీ ప్రక్రియను



పూర్తి చేసి, ప్రతి గింజనూ మద్దతు ధరతో సేకరించాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రైతులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.కేంద్ర నిధుల అంశంపై మాట్లాడుతూ, నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గడిచిన పదేళ్ల కాలంలో తెలంగాణకు వివిధ రూపాల్లో సుమారు రూ.10 లక్షల కోట్ల నిధులను మంజూరు చేసిందని కచ్చితమైన గణాంకాలతో స్పష్టం చేశారు. ఇందులో పన్నుల వాటా కింద రూ.2.3 లక్షల కోట్లు, వివిధ కేంద్ర పథకాల కింద నేరుగా రూ.6.2 లక్షల కోట్లు అందించామని, ప్రతిష్ఠాత్మక రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం రూ.26,000 కోట్లు, కొత్త రైల్వే లైన్లు మరియు స్టేషన్ల ఆధునికీకరణ కోసం రూ.31,221 కోట్లు వెచ్చించామని లెక్కలు వివరించారు. ఖమ్మందేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం, మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పన అంతా కేంద్ర నిధులతోనే జరుగుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆ నిధులను తమ సొంత ఖాతాలో వేసుకుంటూ కేంద్రం ఏమీ ఇవ్వలేదంటూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు.జాతీయ భద్రత, ఉగ్రవాద నిర్మూలన విషయంలో గత కాంగ్రెస్ ప్రభుత్వ బుజ్జగింపు ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల దేశ భద్రత ప్రమాదంలో పడిందని, వారు పాకిస్థాన్‌తో చేతులు కలిపి ఉగ్రవాదులను పరోక్షంగా ప్రేరేపించారని ఆరోపించారు. కానీ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను 'ఆపరేషన్ సింధూర్' వంటి సంచలన సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా సమూలంగా తుడిచిపెట్టేశారని గర్వంగా చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ స్ఫూర్తిని అత్యున్నతంగా కాపాడుకుంటూ వస్తోంది కేవలం బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఖమ్మం గడ్డపై కాషాయ జెండా ఎగరేస్తే కేంద్రం నుండి ప్రత్యేకంగా వేల కోట్ల నిధులు తెచ్చి జిల్లా రూపురేఖలు మారుస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తామని భరోసా ఇస్తూ ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.ఈ ప్రతిష్ఠాత్మక మీడియా సమావేశంలో జిల్లా ప్రబరి మహిపాల్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, సన్నీ ఉదయ ప్రతాప్,వాకధాని పుల్లారావు, నంబురి రామలింగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు, కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ, గోంగూర వెంకటేశ్వర్లు, సారగుల అమరనాథ్, రుద్ర ప్రదీప్, మందడపు సుబ్బారావు, ఖమ్మం కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, సీనియర్ నాయకులు గంట్యాల విద్యాసాగర్, నున్న రవికుమార్, శీలం పాపారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, పమ్మీ అనిత, రజిని రెడ్డి, వీరవెల్లి రాజేష్, రవి గౌడ్, సురేష్ గౌడ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## బీహార్ బైపోల్ బరిలో పీకే?

**మహా :** బీజేపీజాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజీనామాతో ఖాళీ అయిన బంకీపూర్ అసెంబ్లీ స్థానం నుంచి జన్ సురాజ్ పోటీ చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాప అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ ప్రకటించారు. బంకీపూర్‌లో బీజేపీని ఓడించే సామర్థ్యం జన్‌సురాజ్ పార్టీకే ఉందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కాగా అభ్యర్థిగా ప్రశాంత్ కిషోరే పోటీచేసే అవకాశముందని సంకేతాలిచ్చారు. బైపోల్ తో బోణీ కొట్టాలని పీకే భావిస్తున్నారు. తమిళనాడు ఫలితాలతో పీకే ఇమేజ్ పెరిగింది.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు ఎత్తివేయండి

హైదరాబాద్, మహా : ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# తెలంగాణ కోసం

- గొంగడి, గజ్జెలు కట్టుకున్న కళాకారులకు ఉపాధి చూపండి
- కళ కల కోసం కాదు ప్రజల కోసంజిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి వెంకటాచారి.

**కుషాయిగూడ, మహా** : ప్రత్యేక తెలంగాణ కోసం గజ్జెలు, గొంగడి కట్టుకున్న కళాకారులకు ఉపాధి చూపించాలని... కళ కల కోసం కాదని ఆ కల ప్రజల కోసమేనని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి వెంకటాచారి పేర్కొన్నారు. జవహర్ నగర్ బాలాజీ నగర్ లో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి వెంకటాచారి మాట్లాడుతూ ఈనెల 25, 26వ తేదీలలో జరిగే తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని, స్వాతంత్ర పోరాటం నుండి తెలంగాణ సాయుధ పోరాటం వరకు ప్రత్యేక తెలంగాణ పోరాటంలో పాల్గొని అనేక ఆట పాటల ద్వారా మాటల ద్వారా తమ గళాలను వినిపించి నిత్యం ప్రజా సమస్యల కోసం పాటలు వినిపించే తెలంగాణ ప్రజానాట్యమండలి మహాసభలు హైదరాబాదులో నిర్వహిస్తున్నామని తెలిపారు. కల కల కోసం కాదని ఆ కల ప్రజల కోసమేనని వృత్తి కళాకారులకు అండగా తెలంగాణ కోసం గోసి గొంగడి కట్టుకొని పూర్వ ఉద్యమంలో తిరుగుతూ పల్లెవాడ పట్నం అనకుండా తెలంగాణలో ప్రతి పల్లె పట్నం ఏకమై తెలంగాణ వానిని తమ బానినీ వినిపించిన ప్రజానాట్యమండలి కళాకారుల కృషి ఎన్నదగినదని తెలిపారు. అనేక పోరాటాల్లో ముందుండి నడిపించిన ప్రజానాట్యమండలి సేవలు శ్లాగనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు, ఏఐటీసీ మండల అధ్యక్షులు ఎల్లయ్య, ఎంఆర్పిఎస్ నాయకులు వెంకటేశం, ప్రజానాట్యమండలి కళాకారులు అనిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిభావంతులకు పురస్కారాల పండుగ

- పద్మశాలి టౌన్‌షిప్‌లో ఘనంగా సన్మాన కార్యక్రమం

**కుషాయిగూడ, మహా** : పద్మశాలి టౌన్‌షిప్‌లో శ్రీ భావనరుషి పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. 202526 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షులు వనం విజయ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ భావనరుషి హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు సీతాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సీతాంజనేయులు మాట్లాడుతూ, విద్యార్థి దశ జీవితానికి పునాది వంటిదని, ఈ సమయంలో కష్టపడి చదివిన వారే భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడతారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభతో తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావడమే కాకుండా, ఉత్తమ పౌరులుగా ఎదిగి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మేకల వేణు, కార్యవర్గ సభ్యులు నారా జనార్దన్, ఏముల దీప, పున్న నవనీత, బింగి ఉదయశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



## సైకిల్ ర్యాలీతో ఫిట్‌నెస్ సందేశం

**కుషాయిగూడ, మహా** : సీఐఎస్ఎఫ్ ఎన్ఎఫ్‌సీ హైదరాబాద్ ఆధ్వర్యంలో "ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్" 75వ ఎడిషన్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శారీరక దారుఢ్యం, ఆరోగ్యకర జీవనశైలి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమానికి కమాండెంట్ శంకర రావు బైరెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ హరేంద్ర హాజరై సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, ఫిట్‌నెస్ అభిరుచి కలిగిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సైక్లింగ్ ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. దేశాన్ని ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన భారతంగా తీర్చిదిద్దే దిశగా ఈ కార్యక్రమం ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావాన్ని ప్రతిబింబించిందన్నారు.

## మహా.. రెస్పాన్స్



# ధరణి పాయె.. భూభారతి వచ్చె అయినా తిప్పలు తప్పలే.?

- రైతుల బాధను పట్టించుకునే పరిస్థితి లేదా.?
- నిషేధిత జాబితాలో ఉన్న భూముల పరిస్థితి ఏంటి.?
- ఆదిభట్ల మాజీ సర్పంచ్ ఈ సి శేఖర్ గౌడ్..
- నిషేధిత జాబితాను తొలగించేలా ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**:రాష్ట్రంలో ప్రజల మద్దతుతో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండున్నర సంవత్సరాలు పూర్తి అవుతున్న రైతుల కష్టాలు మాత్రం తీరడం లేదని ఈసీ శేఖర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్షాన నిలబడి కొట్లాడుతానని రైతులకు ఏ కష్టం వచ్చినా తాను ముందు ఉంటానని తెలిపిన సందర్భంలో, రైతుల కష్టాలు మాత్రం తీరడం లేదని శేఖర్ గౌడ్, ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూములలోని కొన్ని సర్వే నెంబర్లు.. గత ప్రభుత్వం ధరణితో నిషేధిత జాబితాలో పెట్టడం జరిగింది. నాటి నుంచి రైతులు తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని పలుమార్లు అర్జీ పెట్టుకున్న అధికారులు కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షపాతిగా పేరు సంపాదించుకున్న సందర్భంగా రైతుల కష్టసుఖాలలో ఉండాలని ఆయన కోరారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను అందులో నుంచి తొలగించి, రైతుల భూ పాసుబుక్కులలో తిరిగి చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.

**ధరణి పోయిన దరిద్రం మారలేదని రైతుల ఆవేదన....**
ధరణిని తీసి బంగాళాఖాతంలో పాతరేసిన రైతుల దరిద్రం మాత్రం మారలేదని, ధరణితో నిషేధిత ప్రాంతాల్లో ఉన్న భూములను, ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదని రైతుల కష్టాలు తీరడం కష్టమేనా ధరణి దరిద్రం పోయిన రైతుల దరిద్రం మాత్రం తీయడం లేదని రైతులు ఆవేదనకు లోనవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి, రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు మేలు జరిగేలా చూడాలని ఈసి శేఖర్ గౌడ్, ఎమ్మెల్యేను కోరారు. రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని నిరూపించుకోవాలి..గత ప్రభుత్వం రైతుల భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో నాటి నుంచి రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకపోయింది. రైతులకు ఏదైనా ఆపద వస్తే అమ్ముకొని కష్టాలను తీర్చుకునే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర ఆవేదన గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల కష్టాలు తీర్చడానికి నిషేధిత జాబితాలో ఉన్న భూ సర్వే నెంబర్లను తొలగించి రైతుల భూ పాస్ పుస్తకాలలో చేర్చి, రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని నిరూపించాలని ఈ సీ శేఖర్ గౌడ్ మామ, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## చిన్నారులతో ప్రధాని మోడీ ముచ్చట్లు

**ఢిల్లీ,మహా:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన అధికారిక నివాసమైన 'సేవా తీర్థ్' లో గడిపిన కొన్ని హృదయపూర్వకమైన మరియు అమూల్యమైన క్షణాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లను ఎంతగానో మంత్రముగ్ధులను చేస్తున్నాయి. నిత్యం దేశ రక్షణ, ప్రజా సంక్షేమ పాలన వ్యవహారాలతో ఎంతో బిజీగా ఉండే ప్రధానమంత్రి.. తన వద్దకు వచ్చిన ఇద్దరు బుజ్జాయిలతో కలిసి ఒక సాధారణ ముత్తాతలా మారిపోయి ఎంతో ఆప్యాయంగా సమయం గడిపారు. దీనికి సంబంధించిన ఫొటోలను పీఎం మోడీ స్వయంగా సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ.. "ఇద్దరు బుజ్జాయి స్నేహితులు సేవా తీర్థ్‌కు వచ్చారు" అంటూ ఎంతో మురిపెంగా రాసుకొచ్చారు. ప్రధానికి, ఆ చిన్నారులకు మధ్య ఉన్న అపురూపమైన అనుబంధాన్ని కళ్లకు కట్టిన ఈ చిత్రాలు నెటిజన్ల మనసులను గెలుచుకుంటున్నాయి





## బ్రాహ్మణపల్లిలో ఆధ్యాత్మికశోభ...

- వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం
- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- స్వామివారికి మల్ రెడ్డి ప్రత్యేక పూజలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**:రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం, బ్రాహ్మణపల్లిలో ఆదివారం జరిగిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. వేడుకలకు హాజరైన ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం, ఆలయానికి వెళ్లిన ఎమ్మెల్యే రంగారెడ్డి వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, భక్తులతో కలిసి స్వామివారి కల్యాణాన్ని వీక్షించిన ఆయన నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా వర్ధిల్లాలని వేణుగోపాల స్వామిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలకు రాష్ట్ర ప్రభుత్వం పెట్ట పీట వేస్తోందని.... ఇందులో భాగంగానే ఆలయాల పునరుద్ధరణకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.




## నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి చేసిందేంటి?

- మీ నిర్లక్ష్యంతోనే ప్రభుత్వ భూములు చెరువులు కబ్జా
- ప్రకాశ్ గౌడ్ పై బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి ఫైర్

**రాజేంద్రనగర్ మహా** ; 20ఏళ్ళుగా రాజేంద్రనగర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రకాశ్ గౌడ్ చెరువుల సుందరీకరణ ఎందుకు చేపట్టలేకపోయారని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఈరోజు గుర్తుకొచ్చిందా అంటూ బిజెపి ఇన్ ఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ బిజెపి కార్యాలయంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అయిన మాట్లాడుతూ చాలాచోట్ల ప్రభుత్వ భూములు, పెద్ద సంఖ్యలో చెరువులు కుంటలు అన్యాక్రాంతమవుతున్నాయని, . వాటిని గుర్తించి బౌండరీలు ఏర్పాటు చేసి సుందరీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇంతకాలంగా చెరువులు కుంటలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి అవగాహన లేదా, లేక తన నియోజకవర్గంలో అలాంటి మేధావులు లేరనుకున్నారా? ఇన్ని సంవత్సరాలకు ఇప్పుడు చెరువులపై ధ్యాస మళ్లిందా అని ఎద్దేవా చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ప్రభుత్వ భూములు కుంటలు చెరువులపై వినతి పత్రం ఇవ్వడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. శంషాబాద్ లో జరుగుతున్న భూ కుంభకోణాలపై ఆధారాలతో సహా బయటపెడతామన్నారు. టీఎన్జీవో కాలనీ పార్క్ స్థలంలో వేయి గజాల పార్కు స్థలాన్ని కబ్జా చేసి అపార్ట్మెంట్ కట్టి డ్రైవర్ పై సేల్ డీడ్ చేశారని, . మైలార్ దేవ్ పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 156/1 లోని ప్రభుత్వ భూములలో లేఔట్లు చేసి అక్రమంగా అమ్ముకున్నారని, . ప్రభుత్వ భూములు అమ్మి కోట్లు గడించారని, వీటిపై కూడా హైడ్రాకు ఫిర్యాదు చేయవలసి ఉండాల్సిందన్నారు. చెరువులపై ఫిర్యాదు చేస్తే తోకల శ్రీనివాస్ రెడ్డి భయపడతారు అనుకున్నారా? గతంలోనే మా తాత సంపాదించిన వ్యవసాయ భూమిలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కావాలనే ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్ అనేవి సాకులు చూపి నిర్మాణాలను కూల్చి వేశారు. మీపై వస్తున్న అవినీతి కుంభకోణాలను సాక్ష్యాలతో సహా బయట పెడతానన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లారెడ్డి, వై శ్రీధర్, బాల్ రెడ్డి, కొమురయ్య, మల్లేష్ యాదవ్, గోదా పాండు యాదవ్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రాష్ట్ర వ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సాగు
- ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు!
- రైతులకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నాం




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రైతు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఖమ్మం జిల్లా నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వివిధ ప్రాంతాల నుండి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి ఇతర మంత్రులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సాగు జరిగిందని, ఇందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 575 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 8 వేల 749 కోట్ల రూపాయల కనీసం మద్దతు ధరను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 కోట్ల గోనె సంచులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో వేచి ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల చివరికల్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని, సరిహద్దు జిల్లాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి బయట రాష్ట్రాల నుంచి వరి ధాన్యము,జొన్నలు, మొక్కజొన్నలు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. తాలు, తరుగు విషయంలో రైస్ మిల్లర్లు, దళారులు రైతులను మోసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు త్వరగా టాబ్ లో నమోదు చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఎలాంటి నష్టం రాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో తప్పుడు వార్తలను ఖండించాలని, ప్రతికూల వార్తలపై అధికారులు వెంటనే స్పందించాలని, రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన విషయాలను ప్రచారం చేయాలని తెలిపారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, సరిపడా హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. గతంలో రైతులు వరి ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపు విషయంలో నెలల తరబడి వేచి ఉండవలసి వచ్చేదని, ఇప్పుడు వెంటనే చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా వాయు కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా వ్యవసాయ వ్యర్థాల కాల్చివేసే రైతులకు వాయు కాలుష్య నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు.

అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సాధారణ కార్యవర్గ సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బ తినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములు, కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కార్యక్రమాలను అధికారులందరూ సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వనజాత, జిల్లా మేనేజర్ హరీష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, సిపిఓ సౌమ్య, పిడి మెప్మా వెంకట నారాయణ, డీఎంహెచ్ఓ స్వర్ణ కుమారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 25-05-2026


# కొన్ని ద్విపదలు

చెట్టు నుంచి అకాలంలో
రాలిన ఆకులా భయంకర నిశ్శబ్దం

బీకర గాలివానకు వేళ్లతో
నేల కూలిన వృక్ష బీభత్సం

ఎర్రటి ఎండల్లో మల్లన్నకు
షష్టి పట్నం మొక్కు చెల్లించుకున్న
దైవబీతి

ఆపతి గండం నుంచి కాపాడమని
వేములవాడ రాజన్నకు దండాలు

సంపతి ఎక్కువైతే
పరపతి పెరిగి తిరుపతి యాత్ర

ఎండ పగలు కన్ను మలిగిన ఇల్లు
సాయంత్రం ఒళ్ళు విరుచుకుంటుంది

కుర్చీ ఎంత బరువైన ఎత్తేయదు
చెట్టు నుంచి సంక్రమించిన ఆస్తి అదొక్కటే
పిల్లలను బడి
సంత సరుకుగా మార్చుతుంది

ఎంత ధర పలుకితే
తల్లిదండ్రులకు అంత సంతోషం

రూపాయి బరువుకు
అక్షరాలు గూని పోయాయి

ఒంటరి బనీనులోని బీడీ బిక్క మొఖం
మందిలకు వస్తే పై జేబులో సిగరెట్టు
పొంకం

వేసవి కాలంలో పరీక్షలు ఫలితాలు
రాలిపోతున్న పసి మొగ్గలు

చీకటి కప్పుకున్న రాత్రి
తెల్లారి దుప్పటి చీకటి చుక్కలను దులిపేసింది

అమీబాలు కొన్ని రవీంద్ర భారతి
మెట్లమీద జరజరా పాకుతున్నాయి

తప్పిపోయిన పదబంధాల వాక్యాలు
పిల్లలు భాషను శుభ్రపరుస్తున్నారు

- జూకంటి జగన్నాథం
9441078095

# వాచ్య రాజకీయాలు!

లుప్తమైన రాజనీతి
కాలంలో
రాజ్యం వాచ్య రాజకీయాలదే!

అందరి పలవరింత ఒకటే
ఫలించని కల ఒకటే!

ఆసేతు హిమాచలం
పాదక్రాంతం కావడమే!

ఒకే దేశం ఒకే పార్టీ
చెరగని అందమైన
నినాదం!

ప్రజాస్వామ్య స్ఫూర్తి
అడుగడుగున పరిహాసం!

ఎవరి మనసులో
ఏముందో
వారి వారి మాటల్లో
వాచ్యమే!
విడివిడిగా ఉంటే
ఎవరి కల సాకారం కాదు!

చేయి కలిపి చూడు నాతో
నీ ఊరేగింపు ఊహకుందదు!

ఓపెన్ ఆఫర్ కదు సూపర్
ఇష్టమున్న మాటల్తో
ముసుగు!

పెద్దాయన అన్ని మెట్లు
దిగొచ్చి
ఆశ చూపిన దృశ్యం
స్పష్టం!

ఎంతైనా ఇది రుచి మరిగిన
చేప
అతను వల విసరడమే
తరువాయి!

విశాల భరతావనిలో
ఇప్పుడు
తెలంగాణ ఓ బంగారు
చేప!

అదను కొరకు వేటగాళ్లు
వలలు సిద్ధం
చేసుకుంటున్నారు!

'మన కల నిజం' చేసిన
యోధుల్లారా
పహారా హుషార్!

ప్రమాదం రెక్క విప్పకముందే
సకల జనులను సిద్ధం
చేయండి!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

# ఉత్తర కలకత్తా కవి

**1970ల నాటి అత్యంత సంక్షోభ భరితమైన, ఉద్వేగ భరితమైన బెంగాలీ కవిత్వం లోకి సునామీలా దూసుకుని వచ్చినవాడు ప్రసూన్ బందోపాధ్యాయ. కవిత్వానికి ఒక అంతర్లీన స్వరం, ఒక రహస్య ఉచ్చారణ ఉంటుంది; దాని తో కవి భావోద్వేగాలు ముడిపడి ఉంటాయి. అది ఒక మాయాజాలం లాంటిది. అందుకే 'ఉత్తమ కవిత్వం' అంటూ ప్రత్యేకంగా ఏదీ ఉండదు అనే కవి ప్రసూన్ బందోపాధ్యాయ కవిత్వం అనే ప్రవాహం ముందు నిలబడి**

**"నన్ను నేను ఒక కవిగా భావించుకున్నప్పుడు, భయంతో నా శరీరం చల్లబడిపోతుంది." అంటున్నారు**

అంటే ఏమిటి దాని అర్థం? ప్రసూన్ నమ్మకం ప్రకారం, కవిత్వం అనేది ఒక వ్యక్తి ప్రణాళిక వేసుకుని, ఆలోచించి బలవంతంగా రాసేది కాదు. అది ఒక అపరిచిత శక్తి లాగా, ఒక మాయాజాలం లాగా కవిలోకి ప్రవేశించి అక్షర రూపం దాలుస్తుంది. కవి తాను కేవలం ఒక మాధ్యమం గా మాత్రమే మారుతున్నానని గ్రహించినప్పుడు, ఆ సృష్టి ప్రక్రియను చూసి ఆయనలో ఒక రకమైన 'అతీతమైన భయం' కలుగుతుంది. అదే శరీరాన్ని చల్లబరిచే భయం.ఒక శిల్పి అద్భుతమైన విగ్రహాన్ని చెక్కిన తర్వాత, "దీన్ని నేనేనా చెక్కింది? ఇంతటి అందం నా చేతుల నుండి ఎలా సాధ్యమైంది?" అని ఆశ్చర్యంతో వణికిపోతాడు. కవి ప్రసూన్ పరిస్థితి కూడా అదే. కవిత్వం అనే మహా శక్తి తన ద్వారా వ్యక్తమవుతున్నప్పుడు కలిగే ఆ ఆశ్చర్యం, గౌరవం, బాధ్యతలతో కూడిన భయమే ప్రసూన్ శరీరాన్ని చల్లబరిచేలా చేస్తుంది.

**ఎవరీ ప్రసూన్ బందోపాధ్యాయ?**

ప్రసూన్ బందోపాధ్యాయ ఉత్తర కోల్‌కతా సంస్కృతిలో పెరిగారు. బెంగాలీ నాటక రంగంలో ప్రసిద్ధుడు అయిన నాటకకర్త క్షీరోదప్రసాద్ విద్యావినోద్ ఈయనకు ముత్తాత. ఆ రకంగా సాహిత్యం, కళలు ఆయనకు వారసత్వంగా అబ్బాయి. 1970ల నాటి తీవ్రమైన నక్సల్బరీ ఉద్యమం, రాజకీయ ఉద్రిక్తతలు ఆయన యువ వయసుపై, ఆలోచనలపై బలమైన ముద్ర వేశాయి. 1983లో ప్రచురితమైన ఆయన మొదటి కవితా సంకలనం 'బాలి ఓ తరుముజ్' సమకాలీన బెంగాలీ కవిత్వంలో తన విశిష్టతను చాటుకుంది.'బాలి ఓ తరుముజ్' లోని కవితలు డెబ్బయిలలో రాసినవి.. ఆ కాలపు రాజకీయం సహజంగానే కవిత్వంపై ప్రభావం చూపింది, కానీ అది బిగ్గరగా కాకుండా కొంత రహస్యంగా, నిశ్శబ్దంగా సాగింది. అందుకు ఉదాహరణగా,

**సంఘ్‌బాద్‌పత్రేర్ ఘోర్ ఛాయా"**
**(వార్తాపత్రికల దట్టమైన నీడ)**

**ఈ ఉదయం నేను చింపేస్తున్నాను వార్తాపత్రికల ఆ దట్టమైన, నల్లటి నీడను.**
**నిన్న రాత్రి అంతా మంచు కురిసింది,**

రహస్యంగా ప్రచురించిన ఆ విప్లవ మేనిఫెస్టోల మీద మంచు బిందువులు నిశ్శబ్దంగా రాలాయి.ఇక ఇప్పుడే, సరిగ్గా ఈ ఉదయమే నగరపు వీధుల్లో ఆర్మీ గస్తీ మొదలైంది. తుపాకుల చప్పుడు, బూట్ల శబ్దాల మధ్య నేను వెతుకుతున్నాను ఒక సరికొత్త వాస్తవికతను. నినాదాల హోరులో వినపడని ఆకు రాలిన చప్పుడును వినాలని ఉంది ఈ రక్తపు మరకల వార్తల వెనుక ఎక్కడో దాగి ఉన్న ఉదయపు కాంతిని నా అరచేతుల్లోకి తీసుకోవాలని ఉంది. అందుకే ఈ రోజు, ఈ భయాందోళనల వార్తాపత్రికను చింపి అవతల పారేసి, నిజమైన సూర్యోదయం వైపు నేను నా అడుగులు వేస్తున్నాను అనే కవితను చూడవచ్చు.
అలాంటిదే మరొక కవిత
ఖేలా' (ఆట
"ఓ చందమామా, తెల్లటి చందమామా, నల్లటి మచ్చలున్న రష్యన్ ఫుట్‌బాల్ నువ్వు, నీలిరంగు మైదానంలో ఈ రోజు మేఘాలు నిన్ను తీసుకుని ఎలాంటి ఆట ఆడుతున్నాయో ఇలాంటి గాలి వీచే రోజున... నేను సురజిత్ సేన్‌గుప్తా ఆటను గమనిస్తున్నాను, గమనిస్తున్నాను హబీబ్ ఆ లాంగ్ థ్రూ పాస్ మన జీవితాల వైపు ఎలా దూసుకువస్తోందో!" లాంటి కవితలు చదివితే అర్థం అవుతుంది

ఆయన మొదటి కవితా సంకలనం 'బాలి ఓ తరుముజ్' లోని ప్రసిద్ధ కవిత ఈ ఆట . ఇందులో ఫుట్‌బాల్ ఆటను జీవితానికి, రాజకీయాలకు రూపకంగా వాడారు. ఇలాంటి కవితలు చదివినప్పుడు ఆయన పదాల ఎంపికలోని సరళత అబ్బురపరుస్తుంది. 'బాలి ఓ తరుముజ్' ఆ తరువాత దశాబ్దానికి వచ్చిన 'ఉన్మేష్ గోధూలి'ని దాటుకుని 'బంగీయ చతుర్దశపది' ఇంకా 'ఉత్తర కోల్‌కతార్ కవితా'చదివినప్పుడు ప్రసూన్ కవిత్వం లో చేసుకున్న ఆత్మపరిశీలన ఒక క్రమం లో అర్థం అవుతుంది



ప్రారంభ జీవితంలో నక్సల్ ఉద్యమ ప్రమేయంతో ఉన్న కవి మనస్సు సంస్థాగత వ్యతిరేకత అంచున ఒక పదాల యుద్ధరంగాన్ని సృష్టించగా, కాలక్రమేణా ఆత్మపరిశీలన దానికి కేంద్రబిందువుగా మారింది. నక్సలిజం అనివార్యతను ఎదుర్కొంటూ, "ఈ నాశనం అనివార్యం..." అని రాసిన కవి, "ఇది మరొక స్క్రిప్ట్ వెలుగులో కనిపిస్తుంది..." అనే ఒక బలమైన స్వగతాన్ని విసురుతూ ఆధ్యాత్మిక అన్వేషణను కొనసాగించినందువలన ప్రసూన్ ఒక 'సమన్వయవాద ఆధ్యాత్మికవేత్త'అనే పేరు తెచ్చుకున్నారు. తన ముత్తాత అయిన ప్రఖ్యాత నాటకకర్త క్షీరోదప్రసాద్ విద్యావినోద్ లాగే, ఈయన కూడా రవీంద్రనాథ్ ఠాగూర్ తరహాలో ఆ సహజాతీత పరిపూర్ణతను విశ్వసించారు. దైనందిన జీవితంలోని ప్రతిదీ ఆ పరిపూర్ణత వైపు సాగుతుందనే నమ్మకం ఆయనకు వారసత్వంగా వచ్చింది.
ఒక కవిగా తన యాక్టివిస్ట్ జీవితం నేరుగా కవిత్వం లోకి ప్రవేశిస్తున్నప్పుడు,ప్రసూన్ అత్యంత స్పృహతో కవిత్వాన్ని యాక్టివిజం ఓవర్ లాప్ చేయడాన్ని అధిగమించాలనుకున్నారు. కవిత్వ వస్తువు సామాజికం, రాజకీయం అయినప్పటికీ, అంతిమ రూపాన్ని సృష్టించే ఆ ఆల్కెమీ సామాజిక లేదా రాజకీయ రంగంలో పెద్దగా పాల్గొంటుందని తాను అనుకోనని, కళ అనేది వ్యక్తిగత ఆస్వాదనకు సంబంధించిన విషయమని ప్రసూన్ బలంగా నమ్మాడు.ఈ సంఘర్షణ వలననే ఆయన కవిత్వం లో కొట్టివేతలు,దిద్దుబాట్లు ఎక్కువ.

2005లో 'ఉత్తర కోల్‌కతార్ కవితా' ప్రచురితమవ్వడంతో, ఆయన స్థానికత అనే ఒక కొత్త మార్గం లోకి ప్రవేశించారు. ఇక్కడ 'స్థానికత' అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదు, అది ఒక విశిష్టమైన స్వభావం ఉన్న పాత్ర. అదే విధంగా ఆయన భాష కూడా మారింది. గంగా నది ఒడ్డు స్థానిక మాండలికంలో 'గంగాధార్' అయింది. స్వర, వ్యంజనాల మార్పుతో 'దుఃఖు', 'స్సాలా' వంటి పదాలు కొత్తగా వచ్చి చేరాయి.ఉత్తర కోల్‌కతా అనేది ఒక భౌగోళిక స్థలం కంటే కూడా ఒక సంస్కృతికి సంబంధించినదని,ప్రతి బెంగాలీ జీవితంలోనూ ఒక ఉత్తర కోల్‌కతా ఉంటుందని ప్రసూన్ అంటారు. మరో మాటలో చెప్పాలంటే, ఒక నిర్దిష్ట జ్ఞానం సామాజిక స్పృహతో కూడిన ఆధ్యాత్మికతను అన్వేషించడానికి కలిసే ఒక స్థలాన్నే 'ఉత్తర కోల్‌కతా' అంటారు. ఈ ఏకపాత్రాభినయ ప్రదేశంలోనే కవి తన సరళమైన పదాలను జానపద గాలిలో మరికొంత బలపడేలా చేయడానికి ప్రేరణ పొందారని భావించవచ్చు.

**"ఈలోగా, ఎంతటి విచిత్రం**
**ఈ నొప్పి, ఈ హృదయం..."**

లాంటి వాక్యాలు చదివినప్పుడు ఈ స్వరం, ఈ ప్రతిభ పూర్తిగా కవి విలక్షణ అనుభవ ఫలితమే అనిపించక మానదు
ఉత్తర కోల్‌కతా చీకటి గల్లీలు, తాషా పార్టీ, దేశీ మద్యం, అరుగులు, జాలరి పేటల లోకాచారాలతో ప్రసూన్ కవిత్వం క్రమంగా మలుపు తిరిగి . 'ఆనంద భిఖిరి' కావ్యగ్రంథంలో ఒక మార్మికత తో కూడిన తీవ్రమైన లైంగిక ఆధ్యాత్మికతల సమ్మేళనం సాగుతుంది. దీనికి ఉదాహరణగా 'మధ్యపంథా' కవితను చెప్పుకోవచ్చు .

**'మధ్యపంథా' (మధ్యేమార్గం)**

ఇది ఆయన 'ఆనందభిఖిరి' కావ్యగ్రంథంలోని కవిత. రాజకీయాలను దాటి జీవితంలో కూడా కుడి, ఎడమల తీవ్రతను వదిలి మధ్యేమార్గాన్ని వెతకడం దీని అంతరార్థం
కుడి వైపు కాదు, ఎడమ వైపు కాదు, నువ్వు మధ్యలోకి రా... మధ్యలోకి రా, చాందు ఈ రెండింటి మధ్య నుండి మనం పడవను నడపగలిగితేనే,

అది మెరిసిపోయే మయూర పడవ అవుతుంది; అప్పుడే వీస్తుంది సులువుగా, హాయిగా సాగిపోయే గాలి. రాగద్వేషాలు, సుఖదుఃఖాలు, ఇడా పింగళ... వీటన్నింటికీ నడుమ, ఆ మధ్య దారిలోనే దాగి ఉంది అసలైనప్రయాణం! ప్రసూన్ బందోపాధ్యాయ ఈ కవిత లో లౌకిక జీవితాన్ని, ఆధ్యాత్మికతను ఎంత అద్భుతంగా ముడిపెట్టారో చెప్పడానికి ఈ 'ఇడా పింగళ' ప్రస్తావన ఒక గొప్ప ఉదాహరణ.ఇడా నాడి వెన్నెముకకు ఎడమ వైపున ఉంటుంది. ఇది చంద్రుడికి, శీతలానికి, మానసిక శక్తులకు భావోద్వేగాలకు ప్రతీక.పింగళ నాడి వెన్నెముకకు కుడి వైపున ఉంటుంది. ఇది సూర్యుడికి, వేడికి, శారీరక శక్తులకు తార్కిక ఆలోచనలకు ప్రతీక.సుషుమ్నా నాడి ఈ రెండింటి మధ్యలో ఉండే ప్రధాన నాడి.ఆ కాలంలో బెంగాల్ తీవ్రమైన రాజకీయ ఘర్షణలతో Rightist Leftist సిద్ధాంతాలతో ఊగిసలాడుతోంది. కవి ఈ 'ఇడా' (ఎడమ), 'పింగళ (కుడి) నాడులను ఆ రాజకీయ పక్షాలకు ప్రతీకగా తీసుకున్నారు.యోగ సాధనలో ఇడా, పింగళ నాడులు రెండూ సమస్థితికి వచ్చినప్పుడే శ్వాస మధ్యలో ఉన్న 'సుషుమ్నా' నాడిలోకి ప్రవేశించి మనిషికి పరమానందం అనే సమాధి స్థితి కలుగుతుంది.కవి తన మిత్రుడు చాందును పిలుస్తూ——తీవ్రమైన కుడి వైపునకు గానీ, ఎడమ వైపునకు గానీ వెళ్లకుండా, రాగద్వేషాలకు అతీతంగా ఆ 'మధ్యేమార్గం' గుండా జీవితం అనే పడవను నడపమంటారు. అలా నడిపినప్పుడే జీవితం ప్రశాంతంగా, "సహజంగా వీచే గాలితో ఊపు "తో సాగిపోతుందని చెప్తారు.సరిగ్గా ఇక్కడే ఆయనను విశ్లేషకులు ఆయనను 'సమన్వయవాద ఆధ్యాత్మికవేత్త' (Coordinationist Spiritualist) అని పిలిచారు. ఒక సాధారణ సామాజిక/రాజకీయ కామెంట్‌ను కూడా ఆయన ఇంతటి లోతైన తత్వశాస్త్రంతో ముడిపెట్టి కవిత్వంగా



- ప్రసూన్ బంధోపాధ్యాయ

మలిచారు కనుకే బెంగాలీ కవిత్వం లో అతడిది ఒక యూనిక్ స్వరం అయింది ఆయన ఈ ధోరణి 'మధురతుముల్' కవితలో మరింత లోతుగా మారింది. మధురతుముల్" (మధురమైన తుఫాను) సముద్రపు నడిబొడ్డున ప్రయాణించే ఆ సుదీర్ఘమైన ఓడ మాస్తూలు (స్తంభం) పై నిశ్శబ్దంగా కూర్చుని ఉంది ఒక చిన్న పక్షి. చుట్టూ అనంతమైన నీరు, పైన అపరిమితమైన ఆకాశం.

**ఆ పక్షి సముద్రం దాటే వరకు ఎంతో ఓపికగా, నిశ్శబ్దంగా వేచి చూస్తుంది. ఆ పక్షి ఈ ప్రపంచపు పాఠకుడితో ఇలా అంటోంది :**

"హృదయంలో మాధుర్యం ఉదయించినప్పుడు జీవితం మధువులా మారుతుంది అలాగే కాలం తెచ్చే చేదు చవి చూసినా దుఃఖం గురించీ బెంగ పడవలసిన అవసరం లేదు ఎందుకంటే, సుఖం దుఃఖం, తీపి చేదు అనేవి వేర్వేరు కావు. స్పృహ అత్యున్నత స్థితిలో అవన్నీ ఒక్కటిగా ఏకమవుతాయి. ఈ సృష్టి అంతా పరస్పర విరుద్ధమైన జంటల కలయికతోనే ఏర్పడిన ఒక అద్భుతమైన రచన, మిత్రమా!"
ఆ ఓడ ప్రయాణిస్తూనే ఉంటుంది, ఆ పక్షి నిశ్శబ్దంగా గమనిస్తూనే ఉంటుంది, జీవితం తన మధుర తుఫానును కురిపిస్తూనే ఉంటుంది.
గడిచిన నలభైరెండు సంవత్సరాలుగా సాగుతున్న ప్రసూన్ కవిత్వ ప్రయాణాన్ని గమనిస్తే, కాలంతో పాటు కవి శైలి నిరంతరం మారుతూ వచ్చిందని స్పష్టమవుతుంది. ప్రసూన్ బందోపాధ్యాయ కవిత్వం కవిత్వపు సంపూర్ణ ఊహ, వాస్తవిక ఆలోచనల అపూర్వమైన కలయికలో ఉదయించింది . మలిసంధ్య వేళ విరిగిపడే కాంతి కవి పదాలలో,

"వివరణలు, విశ్లేషణలు పక్కన పెట్టు, నన్ను లోపలికి వెళ్లనివ్వు. అంతకు మించి మరేదీ ముఖ్యం కాదు..." అని పురి విప్పుకుంటుంది.ఈ అంతర్గత స్పృహ, ఆలోచనల లోతుల్లోకి చొచ్చుకుపోయే ఈ అప్రయత్న ప్రయత్నమే ప్రసూన్ ని కీర్తి శిఖరాలకు చేర్చింది. ఆయన కేవలం ఒక ప్రాంతీయ కవి కారు, అలాగే డెబ్బైల నాటి విప్లవాత్మక కవి మాత్రమే కారు. 'ఆనంద్ భిఖిరి' 'గుప్త దాంపత్య కథా' వంటి కవితా పుస్తకాలలో ఆయన మరింత మార్మిక మైన వాడిగా కనిపిస్తారు.
ఆయన కవిత్వ భాషా ప్రయోగం పైకి రోజువారీ సాధారణ చర్య లాగే కనిపిస్తున్నప్పటికీ కృత్రిమమైన బాబు సంస్కృతికి వ్యతిరేకంగా ఒక విధ్వంసాన్ని సృష్టిస్తుంది. ఈ విధ్వంసాన్ని ఆయన తన చివరి కవితా సంకలనం 'టూరిస్ట్ కాహిని' లో మరింత జాగరూకతతో చిత్రించారు. . 'బాలి ఓ తరుముజ్' నుండి 'టూరిస్ట్ కాహిని' వరకు సాగిన ఈ సువిశాల మానసిక ప్రపంచంలో,కవి కొన్ని బాధల ముక్కలను, కథలను, ఆప్యాయతను, పంటలను,గంగ లాంటి నదిని తన ప్రతీకలుగా వదిలేసి వెళతాడు . వాటి కోసమే కాలం నడుస్తుంది. కాలం ఆగిపోతుంది. ప్రసూన్ బందోపాధ్యాయ ఇప్పటికీ తన ఉత్తర కోల్‌కతాలోనే ఉన్నారు, ఆయన ఉండటం ఆర్భాటంగా లేదు. మృదువుగా, ఆత్మమగ్నంగా ఉన్నారు. అయినప్పటికీ ఆయన తన కావ్యదర్శనంలో చేతన శిఖరాన విరాజిల్లుతున్నారు.

- వంశీకృష్ణ
9573427422

# నైతిక భావాల ఖజానా - కశప

కథా రచయితగా రెండు తెలుగు రాష్ట్రాల్లో చెప్పుకోదగ్గ పేర్లలో బి.వి.ఎన్ స్వామి గారు ఒకరు. వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు, ప్రవృత్తి కథా రచయిత. స్వామి గారికి కథలు అంటే ప్రాణం. కథలు చదవడం, రాయడం, చదివించడం, విమర్శించడం ,పరిశోధించడం కార్యశాలలు నిర్వహించడం వారు పనిగా పెట్టుకున్నారు. స్వామి గారి భౌతిక ప్రపంచం మానసిక ప్రపంచం కథల చుట్టే అల్లుకొని ఉంటుంది. ఇప్పటివరకు 12 పుస్తకాలు రాశారు.

కథలు సామాజిక పరిణామాన్ని, సంస్కృతిని, కాలమాన పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. సమాజం మార్పుకు గురి అవడం సహజమే, కానీ ఆమార్పు ఆరోగ్య మైనదిగాక , వనరుల విధ్వంసం చేసేదిగా, సంస్కృతిని పాడు చేసేదిగా ఉన్నప్పుడు బాధ్యత కలిగిన సాహితీపరులు, చైతన్యవంతులైన సాహిత్యకారులు తమ రచనల ద్వారా సంఘాన్ని సరైన దారిలో నడిపించడం కోసం ముందు నడుస్తారు. స్వామి గారు ఆకోవకు చెందినవారే. భూత కాలంలోని మంచిని వర్తమానానికి, వర్తమానం నుండి భవిష్యత్తుకు అందించాలనే తాపత్రయం స్వామి గారి కశప 2 కథలలో మనకు కనిపిస్తుంది.

సాహిత్య ప్రయోజణంలో విలువలు కూడా ముఖ్యమే కేవలం పిల్లల్లో కాదు పెద్దల్లో కూడా విలువలు పెంపొందించే విధంగా ఈ కథలు ఉన్నాయి. సామాజిక ప్రయోజనం నూటికి నూరుపాళ్ళు కలిగిన రచన కశప 2. పాఠకుల దృష్టిని ఇట్టే ఆకర్షిస్తుంది. ఇది స్వామి గారు కథకుడిగా సాధించుకున్న గొప్ప విషయం.

ఇందులో బుంగి పాత్ర బాపు రమణల బుడుగు లాంటిదే, కానీ ఒక క్యారెక్టరుకు ఇది కట్టుబడి ఉండదు. ఈ పాత్ర స్త్రీగాను, పురుషుడిగాను, ఒకసారి అమాయకుడిగా, ఒకసారి తెలివైన వాడిగా, మరోసారి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా, ప్రశ్నగా, సమాధానంగా, కొన్నిసార్లు విద్యార్థిగా, మరికొన్నిసార్లు ఉపాధ్యాయుడిగా కథకు అనుకూలంగా పాత్ర మారిపోతుంది. ఇందులో మొత్తం 108 కథలు ఉన్నాయి.

'కశప' అనగా కథా శతక పద్యం. తను రాసిన కథకు అనువైనటువంటి గొప్ప గొప్ప శతకకారులు రాసిన శతకాల నుండి పద్యాలను తీసుకొని ఆ పద్యాన్ని కథకు జోడించి రాసినదే కశప 1.

కశప 2లో తను రాసిన కథకు తనే పద్యం రాసి కథకు జోడించినారు. కశప 2లో శతక కవిగా మనకు దర్శనమిస్తారు రచయిత స్వామి గారు. పదవి విరమణ వయసులో తేటగీతి పద్య చందస్సు నేర్చుకుని పద్యాలు రాయడం మనమిక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం. స్వామి గారు రాసిన పద్యాలకు శతక లక్షణమైన మకుటం "కశప చెప్పిన కథనమ్ము కాంతి పథము" సాధారణంగా శతకకారులు మకుటంలో తన పేరు వచ్చే విధంగా రాసుకుంటారు. కానీ స్వామి గారు మకుటంలో "కశప చెప్పిన కథనమ్ము కాంతి పథము" అంటారు. కథ రచయితగా కథ పైన ఉన్న మమకారంతో ఇలా చెప్పి ఉంటారు. పద్యాన్ని కథకు జోడించడం అనేది నూతన సంప్రదాయం. అందుకే దీన్ని మనం నూతన ప్రక్రియగా చూడవచ్చు.

తన గురించి తను తెలుసుకోవడానికి అన్నయ్యలా గొంతు మార్చి అమ్మతో ఫోన్లో మాట్లాడాడు బుంగి. ఆవిషయం తర్వాత ఆమెకు చెపుతాడు. నన్ను పరీక్షించి మోసం చేశావు. నిన్ను గురించి నువ్వు తెలుసుకోవడానికి నీలోకి తొంగి చూడు అని బోధ చేస్తుంది అమ్మ. ఆ కథను కోడీకరిస్తూ చెప్పిన పద్యం.

తనను తాను తెలుసుకొన, తనను కన్న
తల్లి తోడను మాటాడి తప్పు చేసే
లోన పరికింప తెలియును లోని తప్పు
కశప చెప్పిన కథనమ్ము కాంతి పతము

"శాసనము" అనే కథలో ఆదికవి నన్నయ ఆంధ్ర మహాభారత రచన కంటే శతాబ్దం పూర్వమే తెలంగాణలో పద్యాలు రాసే స్థాయికి తెలుగు భాష అభివృద్ధి చెందినట్లు, తెలిపే కురిక్యాల వద్ద బొమ్మలమ్మ గుట్టపై పంపమహాకవి సోదరుడైన జినవల్లభుడు వేయించిన సంస్కృత, కన్నడాంధ్ర పద్యాలతో కూడిన సుప్రసిద్ధ త్రిభాషా శాసనము ఉన్నది. తెలుగుకు ప్రాచీన హోదా దక్కడానికి ఇందులోని చివరి మూడు తెలుగు పద్యాలు కారణం. గ్రానైట్ మాఫియా బారి నుండి ఈ గుట్టను దానిపైనున్న శాసనంను రక్షించడం వల్ల నేడు తెలుగు భాషకు కలిగిన లాభము, అని కథ తెలియజేస్తుంది. ఈ కథ సారాంశాన్ని క్రోడీకరిస్తూ స్వామి గారు రాసిన నీతి పద్యము చూడండి.

నాటి నేటి మనుషుల నడక తీరు
మిగిలేనిచ్చట గురుతులు మేలు చేయ
శాసనము నిల్చె గుట్టకు శస్త్రమోలే
కశప చెప్పిన కథనమ్ము కాంతి పథము

అచ్చు యంత్రాలు, కాగితాలు లేని కాలంలో మనిషి తన జ్ఞానాన్ని తాటాకులపై పదిలపరిచాడు. వాటిని తాళపత్ర గ్రంధాలు అంటాము. తాళపత్ర గ్రంధాల గురించి తెలిపే కథ "లిఖిత" ఆ కథను క్రోడీకరిస్తూ స్వామి గారు రాసిన మరో పద్యం చూడండి.
ఆనవాళ్లు రెండు నవని యందు జూడ
చరిత దొరుకును మనకింక చక్కగాను
దాని వెంబడి లిఖిత యాధార మొకటి
కశప చెప్పిన కథనమ్ము కాంతి పథము. ఇలా కథకుడు పద్య కవిగామారడం మనకు కనిపిస్తుంది.
కశప 2లోని కొన్ని కథలను పరిశీలిద్దాం.
అభివృద్ధి పేరున అడవుల్ని, ఆధునికత పేరుతో గుట్టల్ని నాశనం చేస్తూ పర్యావరణ విధ్వంసం చేస్తున్న ఆవేదన "మిగులు" కథలో కనిపిస్తుంది.

మంచితనం కాలం గడుస్తున్న కొలది మనుషుల్లో మాయమవుతుందని తెలియజేసే కథ మమత. మంచితనం ఉన్న కొద్దిమంది ఇప్పుడు కూడా మన మధ్య ఉన్నారు. కాని వారిని తెలుసుకునే తీరిక, ఓపిక, మమత మనుషులకు లేకుండా పోయిందనే ఆవేదన "మమత" కథలో కనిపిస్తుంది.

చదువు కోసం ఇంటి నుండి బయలుదేరి రోడ్డు ఎక్కి పుస్తకం వదిలి, తరగతి వీడి పగలు రాత్రి అనకుండా ఆడ, మగ తేడా లేకుండా ఏకరీతి ప్రవర్తనతో రేపటి పౌరుల మురికి చేష్టలను తెలియజేసే కథ "మురికి"

బడి చదువులు నేర్పే పాఠాలకంటే జీవితం నేర్పే పాఠాలు గొప్పవి అనే విషయాన్ని తెలియజేసే కథ "పెదవులు"

రంకు రాజకీయాలు ఉన్నచోట సున్నితత్వం పని కిరాదని సర్పంచ్ పదవికి రాజీనామా చేసి వ్యాపారంలో చేరి డబ్బు సంపాదించే క్రమంలో వెలుగునీడల జాడలు అర్థం చేసుకొని పేద పిల్లల చదువు కోసం ఆశ్రమ పాఠశాల స్థాపించి 'ధనవంతుడిలా సంపాదించు పేదగా బ్రతుకు' అనే సూత్రాన్ని పిల్లలకు ఎలా వంట పట్టించాడో "పదవి" కథ చదివితే అర్థమవుతుంది.

అందమైన పిట్టగూడు నిర్మించి మురిసిన బుంగి బిక్కమొఖం వేసి బేలగా ఎందుకు ఏడ్చాడు "అందము"కథ చదివితే గాని బోధపడదు.

ప్రభుత్వ ఉద్యోగుల్లో పని పట్ల అలసత్వం, నిర్లక్ష్యం ఎక్కువ అన్న పత్రిక విలేకరి మాటలకు బుంగి సమాధానం ఏమిటి?

ఊరును పట్టించుకునే తండ్రి ఇల్లునెందుకు పట్టించుకోడో అర్థం కాక, కలిమిడిగా ఉండే బుంగి ఒంటరిగా ఉండడం ఎలా నేర్చుకున్నాడు, పుస్తకాలకు, బోధనకు ఎలా దగ్గరయ్యాడు తెలుసుకోవాలంటే...

ఇంటి కన్నా హాస్టల్ నయమని అనుకున్న బుంగి బతుకు పెనం మీది నుండి పొయ్యిల పడ్డట్టు ఎందుకయ్యిందో?

టీ.వీ వల్ల కాలం ఎట్లా తరిగిపోతుందో, మనుషుల మతిమరుపుకు ఎలా కారణమో! మన టీవీని మింగేయడానికి టీ.వీ ఎలా కారణమో!

విద్యార్థి దశలో పాఠశాలలో ఏ విధంగా ఉన్నాడో 30 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వచ్చిన మార్పేమీ లేని బుంగి గురించి తెలుసుకోవాలంటే స్వామి గారి కశప 2 చదవాల్సిందే.

టెక్నాలజీ, గ్లోబలైజేషన్ పేరా ప్రపంచంలో కూనరిల్లుతున్న మానవ సంబంధాలను, విధ్వంసం అవుతున్న పర్యావరణ పరిస్థితులను కళ్ళకు కట్టినట్టు చూపించడంలో రచయిత నూటికి నూరుపాళ్ళు కృతకృతులయ్యారు.

ఎన్నో నూతన ప్రక్రియలను ఆదరించిన తెలుగు సాహిత్యకారులు కశప 2ను కూడా హక్కున చేర్చుకుంటారని ఆశిస్తున్నాం, స్వామి గారికి అభినందనలు.

- దామరకుంట శంకరయ్య
సెల్ : 9440876788

# మాతృమూర్తి స్మృతులు

నాకు అమ్మ గుర్తు లేదు
కానీ ఒక్కోసారి హఠాత్తుగా
నాకు వినబడుతుంది
మధురమైన లాలి పాట
నా ఆటల్లో ఆ పాట
కలిసి పోయినట్లు అనిపిస్తుంది
నా ఉయ్యాల ఊపుతూ
అమ్మ ఆ పాట పాడిందా?
నా కోసం ఆ పాట వదిలి
వెళ్ళిందా?

నాకు అమ్మ గుర్తు లేదు
కానీ శరదృతువులో
మంచు కమ్ముకున్న
గాలిలో
పారిజాత పుష్పాల
పరిమళం దాగి ఉంటుంది
అమ్మ తన బుట్టలో
ఆ పువ్వులు నింపుకుందా?
అందుకే పూజ గదిలోని
సుగంధం
అమ్మ నుండి వచ్చే
సువాసన అయ్యిందా?

నాకు అమ్మ గుర్తు లేదు
కానీ నేను నా గది గవాక్షం
నుండి
సుదూర నీలాకాశం లోకి
చూస్తున్నప్పుడు
అమ్మ నా వైపు
చూస్తున్నట్లు
అనిపిస్తుంది
నన్ను తన ఒడిలోకి
తీసుకుని
నా వైపు చూసిన అదే
చూపు
అపారమైన ఆకాశంలో గోచరిస్తుంది..!

(రవీంద్రనాథ్ ఠాగూర్ (1861 1941) బెంగాలీలో 'మొనేపొడా' (గుర్తు చేసుకుంటూ ) అనే శీర్షికతో రాసిన కవితను నా స్నేహితురాలు కుమ్ కుమ్ రాయ్ ఆంగ్లంలో 'రిమెంబరింగ్' అనే శీర్షికతో అనువాదం చేసింది. దానికి నా తెలుగు అనుసృజన ఇది. రవీంద్రుని తల్లి శారదా దేవి (1830 1875) రవీంద్రుడికి పద్నాలుగేళ్ల ప్రాయంలో ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయింది. ఆమె చనిపోయిన ఎన్నో దశాబ్దాల తర్వాత 1921 లో రవీంద్రుడు ఈ కవిత రాశారు. ఆయన బాల్యం కలకత్తాలో తన ఇల్లైన జొరసంకో భవనంలో గడిచింది. తల్లి త్వరగా చనిపోవడం వలన, తండ్రి దేబేంధ్రనాథ్ టాగోర్ (1817 1905) తరచు యాత్రలు చేస్తుండటం వలన రవీంద్రుడు సేవకులు సంరక్షణ లో పెరిగాడు. మగ సంతానంలో ఆఖరి వాడిగా, పదమూడు మంది పిల్లల్లో తొమ్మిదవ వాడిగా పెద్దయ్యాడు. ఇల్లు దాటి బయటకు వెళ్ళడానికి అనుమతి లేకపోవడం వలన ఇంట్లోనే ఏకాకిగా, తన ఊహల ప్రపంచంలో మునిగి ఉండేవాడు. ఈ కవిత ఆయన తన తల్లి జ్ఞాపకాలను మనసులో ఎంత పదిలంగా దాచుకున్నాడో తెలుపుతుంది. అమ్మ గుర్తు లేదంటూనే చెరిగిపోని స్మృతులను కలబోసుకోవడం కనబడుతుంది.)

- శాంతి శ్రీ బెనర్జీ
9871989360

# రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
haneefsd777@gmail.com
whatsapp 9247580946



# బాధలో బాసటగా ..

- కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**ఆదిలాబాద్ మహా** : ఆపదలో ఉన్నవారికి ఆప్తులను కోల్పోయి దుఖం లో ఉన్నవారికి అనారోగ్యంతో బాధ పడుతున్నవారికి నేనున్నానన్న భరోసా కల్పిస్తున్నారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి .ఆదివారం జైనథ్ భోరజ్ మండలాలలో పర్యటించి పలువురిని పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన దీపాయి గూడ గ్రామంలో కజ్జర్లోక రాజక్క కుటుంబ సభ్యలను, మాకోడ గ్రామంలో బద్దం రామ్ రెడ్డి కుటుంబ సభ్యలను బెల్గాం గ్రామంలో బద్దం లసుమ్ బాయి కుటుంబ సభ్యలను ,బెల్లూరి లో గంగం విజయ కుటుంబ సభ్యలను గిమ్మ గ్రామంలో దోసలి లింగన్న కుటుంబ సభ్యలను ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పుదరే తేజశ్రీ కుటుంబ సభ్యలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు. ఆయా కుటుంబాలకు ధైర్యం చెప్పారు. గిమ్మ గ్రామంలో దోసలి లింగన్న కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు , జైనథ్ ఆలయ చైర్మన్ రుకేష్ రెడ్డి , సింగిరెడ్డి రాంరెడ్డి , శాంతన్ రావు, దీపక్ రావు , ఎంఎ షకీల్, నిఖిలేష్, రాజీవ్,అమ్ముల రమేష్, సదలి శివన్నతదితరులున్నారు.







# లారీలో ఎమ్మెల్యే..

కరీంనగర్ మహా : రైతులకు ఇచ్చిన హామీలను ఆచరణలో చూపిస్తూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మరోసారి ప్రత్యేకంగా నిలిచారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన ఆయన, ఆ మాటలను నిలబెట్టుకుంటూ క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి స్వయంగా చర్యలు చేపట్టారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో లారీల కొరత సమస్యగా మారడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని గుర్తించిన కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైతుల ఇబ్బందులను వెంటనే పరిష్కరించేందుకు స్వయంగా రంగంలోకి దిగారు. ఆదివారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తా సమీపంలోని కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారిపై మంగపేట చెక్‌పోస్ట్ వద్ద వెళ్తున్న లారీలను ఆపి, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపునకు సహకరించాలని లారీ యజమానులతో మాట్లాడారు. అంతేకాకుండా తానే స్వయంగా లారీలో కూర్చుని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లడం విశేషంగా నిలిచింది. లారీ లోడింగ్ పూర్తయిన తర్వాత మిల్లుల్లో వెంటనే అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా చొప్పదండి నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి నిరంతరం పర్యవేక్షిస్తూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



# రైతు దోపిడికి గురవుతున్న పట్టించుకోని ప్రభుత్వం

- సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్

**సత్తుపల్లి, మే 24**: మహా : వరి ధాన్యం కొనుగోలులో రైతులను నిలువు దోపిడి చేస్తున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూస్తుందని సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సత్తుపల్లిలోని రావి వీర వెంకయ్య భవనంలో సత్తుపల్లి మండల కమిటీ అయినంపూడి సదానంద రావు అధ్యక్షత జరిగిన సమావేశంలో జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. రైతులు కష్టం చేసి పండించిన వరి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. ప్రభుత్వ నాయకులు చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన లేదన్నారు. కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం ఎగుమతి చేయకపోవడంతో రెండు నెలలుగా మార్కెట్ యార్డులలోనే రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్ల యాజమాన్యం ఒక్క లారీ దిగుమతి కోసం ఆరు రోజుల సమయం తీసుకోవడంతో లారీల కొరత ఏర్పడి వడ్ల కొనుగోలు ఆలస్యం జరుగుతుందని అన్నారు. రైతాంగం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికి అధికారులు, ప్రభుత్వ నాయకులు ప్రకటనలు చేయడానికి పరిమితం అయ్యారని దుయ్యబట్టారు. వడ్ల కొనుగోలు జాప్యం వాతావరణ మార్పులతో రైతులు బెంబేలెత్తుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్ల యాజమాన్యాలు వడ్ల కొనుగోలు విషయంలో తీరు మార్చుకోవాలని లారీల కొరత, తరుగు లేకుండా జిల్లా యంత్రాంగం స్పందించి వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, మండల కమిటీ సభ్యులు వేపులపాటి కుమారస్వామి, కువ్వారపు లక్ష్మణరావు, యలగం కృష్ణయ్య, తడికమళ్ళ రామకృష్ణ, హసావత్ కృష్ణ, యలగం రాములు, దాట్ల రాంబాబు, బెజవాడ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.







# రెడ్డి సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని అభినందించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా** : ఆదిలాబాద్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘ ఎన్నికల సందర్భంగా ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పట్టణంలోని న్యూ హౌజింగ్ బోర్డు కాలనీ లోని రెడ్డి సంక్షేమ సంఘ కార్యాలయాన్ని సందర్శించారు..ఆదివారం జరిగిన ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షులు ఎల్టీ ఓంప్రకాష్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి అల్లూరి భూపతి రెడ్డి , ఉపాధ్యక్షులు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, సింగడి పద్మ రెడ్డి ,కోశాధికారి సర్సన్ విట్టల్ రెడ్డి తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్లు రమేష్ రెడ్డి , ప్రమోద్ రెడ్డి , కో ప్రెసిడెంట్లు గోవర్ధన్ రెడ్డి మనిలతా రెడ్డి ,మిగితా కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారిని శాలువాలతో సత్కరించారు.. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని ఆకాంక్షించారు ..ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు స్వామి రెడ్డి , భూమారెడ్డి ,శేఖర్ రెడ్డి, వైశాలి రెడ్డి, జగదీష్ రెడ్డి, సవీన్ రెడ్డి , శివప్రసాద్ రెడ్డి ,సతీష్ రెడ్డి , రవి రెడ్డి భూమారెడ్డి, లింగా రెడ్డి, పోతా రెడ్డి సుశాంత్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# పంట వ్యర్థాలు తగలబెడితే చర్యలు తీసుకుంటాం

**నేలకొండపల్లి, మే 24 మహా :** రైతులు పంట వ్యర్థాలను తగలబెడితే కఠిన చర్యలు తీసుకుంటామని నేలకొండపల్లి తహశీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య లు ఆదివారం సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. రైతులు పంట పోలాలలో ఉన్న వ్యర్థాలను తగలబెట్టటం వలన పక్కన ఉన్న పంటలు పూర్తిగా దగ్ధమైతున్నాయని పేర్కోన్నారు. రైతులు, వ్యర్థాలను కాల్చకుండా వారికి ముందస్తుగా అవగాహన కల్పించాలని ఆయా శాఖల అధికారుల కు సూచించారు. ఇళ్ల పక్కనే ఉన్న వరి గడ్డి, పూరిగుడిసెలు, మామిడి తోటలు కాలిపోతున్నాయని తెలిపారు. ఎండ తీవ్రత వలన రైతులు వ్యర్థాలను కాల్చవద్దని సూచించారు. తగలబెట్టిన ' పక్షంలో చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈవో లు, జీపీవో లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవిన్యూ సహాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రైతులు పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని వారు కోరారు.



# వడదెబ్బ కు వ్యక్తి మృతి

**నేలకొండపల్లి, మే 24 మహా** :వడదెబ్బకు మండలం లోని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని పైనంపల్లి గ్రామానికి చెందిన బీమాల వెంకటేశ్వర్లు (43) అనే వ్యక్తి గ్రామాలలో పాత ఇనుము, ప్లాస్టిక్ వేరుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం నేలకొండపల్లి మండల కేంద్రంలో బోదుల బండనేలకొండపల్లి గ్రామాల మధ్య ప్లాస్టిక్, ఇనుము ముక్కలు వేరుకునేందుకు వెళ్లాడు. ఎండ తీవ్రత వలన మార్కెట్ సమీపంలో వడదెబ్బకు గురై రోడ్డు పై పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ హస్పిటల్ లో పోస్టు మార్టమ్ నిర్వహించారు.



# విశ్వశాంతి విద్యార్థికి ఎమ్మెల్యే అభినందనలు.

**సత్తుపల్లి, మే 24**: మహా: విద్యార్థుల కృషికి ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం తోడైతే అద్భుత ఫలితాలు సాధిస్తారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 97 వేలమంది పోటీపడిన పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షలో సత్తుపల్లి ప్రాంతానికి చెందిన ఎండి. అర్ఫజ్ అలీ (విశ్వశాంతి స్కూల్) 120/120 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావటం సత్తుపల్లికి గర్వకారణం అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారంస్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్ విజయ్ కుమార్, సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ ఎండి. రెహానా బేగం కమల్ పాషా, సత్తుపల్లి సహకార సంఘ అధ్యక్షులు చల్లగుళ్ల కృష్ణయ్య అర్ఫాజ్ ను శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛంతో అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఫలితాలలో తొలిసారిగా సత్తుపల్లికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ రావడం ఆనందంగా ఉందన్నారు. సత్తుపల్లి సత్తా చాటిన అర్ఫాజ్ తో పాటు తల్లిదండ్రులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. విశ్వశాంతి యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ మాట్లాడుతూ.. మార్కులు, ర్యాంకులు మాత్రమే ధ్యేయంగా కాకుండా విశ్వశాంతిలో విద్యార్థులకు సబ్జెక్టు పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనీల్, అవినాష్, క్రిస్టాపర్,పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# పనికి తగ్గ వేతనం ఇవ్వండి

- మమ్మల్ని ఉద్యోగులుగానే గుర్తించండి.
- నెలకు రూ.150 గౌరవ వేతనం నుండి సేవలందిస్తున్నాం.
- రూ.5వేలతో కుటుంబాలను ఎలా పోషించాలి.
- విఓఏల ఆవేదన.



**సత్తుపల్లి, మే 24**: మహా: మండలంలో గ్రామీణాభివృద్ధి కోసం సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న విఓఏలు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు) తమ జీవన సమస్యలపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు కేవలం రూ.150 గౌరవ వేతనం నుండి సేవలందిస్తున్నామని, ఇప్పటికీ రూ.5000 వరకు మాత్రమే వేతనం అందుతున్న పరిస్థితుల్లో కుటుంబాలను పోషించడం కష్టమవుతుందని వాపోతున్నారు. శుక్రవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయ ఎదుట
సత్తుపల్లి మండల విఓఏల సంఘం అద్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షురాలు తుమ్మలపల్లి సరోజిని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో మేము కీలక పాత్ర పోషిస్తున్నామని, గ్రామాల్లో మహిళా సంఘాల నిర్వహణ నుంచి పేదల సంక్షేమ కార్యక్రమాల వరకు బాధ్యతలు నిర్వర్తిస్తున్నా, మాకు కనీస వేతనం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వేతనాలను కనీసం నెలకు రూ.20 వేలుగా నిర్ణయించి, నేరుగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా హెచ్ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 18వ తేదీ నుంచి సమ్మె చేపట్టినట్లు సరోజిని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు నిరసన కార్యక్రమాన్ని విరమించమన్నారు. పని మాత్రం ప్రభుత్వ ఉద్యోగిలా చేపిస్తున్నారని, గౌరవం మాత్రం కాంట్రాక్ట్ కార్మికుల కంటే తక్కువగా చూస్తున్నారని మండిపడ్డారు.విఓఏలు తమకు సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యంతో పాటు రూ.20 లక్షల బీమా కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా అధికారిక గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు. అర్హులైన విఓఏలకు కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా (సీసీలు) పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పేదల కోసం పని చేసే మేమే, ఇప్పుడు మా హక్కుల కోసం రోడ్డెక్కాల్సి రావడం బాధాకరమని పలువురు మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సాదు చిట్టెమ్మ, నారపోగు సుధాకర్, సుజాత, అలీంబి , భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, ధనలక్ష్మి, పద్మ, లత తదితరులు పాల్గొన్నారు.



# బూర్గంపహాడ్ అదనపు ఎస్ఐగా వి. రామమూర్తి నియామకం

**బూర్గంపహాడ్ మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో అదనపు ఎస్ఐగా వి. రామమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం బూర్గంపహాడ్‌లో ట్రైనింగ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న దేవ్‌సింగ్‌ను అశ్వారావుపేటకు బదిలీ చేసిన నేపథ్యంలో ఈ నియామకం జరిగింది.వి. రామమూర్తికి బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఇదే పోలీస్ స్టేషన్‌లో 2014 మరియు 2018 సంవత్సరాల్లో ఏఎస్ఐగా సేవలందించి స్థానిక ప్రజలతో మంచి అనుబంధం ఏర్పరుచుకున్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, ప్రజలకు అందుబాటులో ఉండే తత్వం కారణంగా ఆయనకు మంచి గుర్తింపు లభించింది.మరోసారి బూర్గంపహాడ్‌లో బాధ్యతలు చేపట్టిన రామమూర్తికి స్థానికులు, సహచర పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



# సారపాక సెంటర్‌లో మరో గుర్తు తెలియని మృతదేహం

**వడదెబ్బలతో వరుస మరణాలు .. చలివేంద్రాలు ఏర్పాటు చేయాలంటూ ప్రజల విజ్ఞప్తి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బలు, అస్వస్థత కారణంగా మరణాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పలువురు తీవ్ర ఎండలకు గురై అనారోగ్యానికి లోనవుతున్నారు.శనివారం సాయంత్రం సారపాక ప్రధాన సెంటర్ వద్ద భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి రక్తపు వాంతులు చేసుకొని మృతి చెందిన ఘటన స్థానికులను కలిచివేసింది. ఇదే తరహాలో ఈరోజు కూడా సారపాకలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రగతి బుక్ స్టాల్ ఎదురుగా ఉన్న శ్రీ కనకదుర్గ మ్యాచింగ్ సెంటర్ షాపు ముందు ఓ గుర్తు తెలియని వ్యక్తి వాంతులు చేసుకొని మృతి చెందిన స్థితిలో కనిపించాడు. సమాచారం అందుకున్న స్థానికులు ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు.మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

ANN తెలుగు
మహా పత్రిక 06
సోమవారం, హైదరాబాద్ | 25-05-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM



## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

- **ఉద్యమకారుల గుర్తింపు విధి విధానాలపై అవగాహన**

**బూర్గంపహాడ్ మహా** : బూర్గంపాడు మండలం లోని తెలంగాణ తొలి మరియు మలిదశ ఉద్యమాలలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నాడు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం తెలంగాణ ఉద్యమకారుల ఐక్యత, గుర్తింపు మరియు సంక్షేమ అంశాలపై చర్చించేందుకు వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ తెలంగాణ ఉద్యమ ఇన్‌చార్జి పోడియం నరేందర్ పాల్గొన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమకారుల బూర్గంపాడు మండల గౌరవ అధ్యక్షుడు తోడేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో సారపాకలో ప్రెస్‌మీట్ కూడా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. త్వరలో అమలులోకి రానున్న తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు విధి విధానాలపై ఉద్యమకారులకు వివరాలు తెలియజేశారు.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది ఉద్యమకారులకు ఉన్న గుర్తింపు సంబంధిత అనుమానాలను సమావేశంలో నివృత్తి చేశారు. అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగేలా చర్యలు కొనసాగుతున్నాయని నాయకులు పేర్కొన్నారు.ఈ సమావేశంలో బీరెల్లి దుర్గారావు, కాసర్ల దామోదర్ రెడ్డి, కొక్కొండ ప్రసాద్, సాంబారెడ్డి, బాసిపోయిన మోహన్‌రావు, పారుపల్లి శ్రీనివాస్, దాసరి సాంబ, శెనగ పుల్లారావు, నల్లమోతు సురేష్, గుర్రాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతం కు శక్తి వంచన లేకుండా కృషి చేస్తా

**నేలకొండపల్లి, మే 24 మహా** : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోడాలి గోవిందరావు పేర్కొన్నారు. నూతన మండల అధ్యక్షుడుగా నియమించిన సందర్భంగా మండలం లోని రాజేశ్వరపురం లో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పార్టీని గ్రామ స్థాయి లో విస్తరించేందుకు ప్రతీ ఒక్కరూ పని చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పధకాల గురించి ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేస్తారన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తో మండలం లో గుడిసె లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కార్యచరణ ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే గ్రామ, బూత్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రబోయిన నర్సయ్య, బుర్ర లింగరాజు, బీ.సతీష్, ఇస్లావత్ చందు, డి.వెంకన్న, ఎన్.కోటేశ్వరరావు, తుపాకుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహం రక్షణ గోడ ధ్వంసంపై ఆగ్రహం

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి** : ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ జేఏసీ నాయకుల డిమాండ్

**భద్రాచలం మహా** : భద్రాచలం పట్టణ నడిబొడ్డున ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం రక్షణ గోడ ధ్వంసమైన ఘటనపై ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ జేఏసీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం గుర్తు తెలియని వాహనం అంబేద్కర్ విగ్రహం చుట్టూ నిర్మించిన రక్షణ గోడను ఢీకొని ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు.ఈ ఘటనను నిరసిస్తూ జేఏసీ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద మండుటెండలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. "జై భీమ్" నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి రక్షణ గోడను ధ్వంసం చేసిన డ్రైవర్‌పై, సంబంధిత వాహనంపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందా అనే కోణంలో కూడా పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఘటన జరిగి 24 గంటలు గడిచినా ఇప్పటివరకు సీసీ కెమెరాల ఆధారంగా వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకోకపోవడంపై జేఏసీ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ఈ నిరసన కార్యక్రమంలో ముర్ల రమేష్, ఈటె రాజేశ్వరరావు, పలాంటి రాజేశ్వరరావు, భీమపాక పెద్దరాజు, టీవీ గారు, ఇమ్మంది నాగేశ్వరరావు, పేరాల నాగరాజు, ముద్ద పిచ్చయ్య, దాసరి శేఖర్, నాగార్జున, 10వ వార్డు మెంబర్ నిట్టా రాజు, కేసుపాక వెంకటేశ్వర్లు, సోందే రవికుమార్, కేసుపాక కృష్ణ తదితర జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం తరలింపు వేగవంతం చేయాలి

- **ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తనిఖీ**
- **ప్రభుత్వ విప్ వేముల వీరేశం**

**భువనగిరి మే 24 మహా న్యూస్** : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని వెల్లంకి సిరిపురం రామన్నపేట పట్టణం దుబ్బాక మునిపంపుల ఎన్నారం గ్రామాలలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేసిన ప్రభుత్వ విప్ నకిరేకల్ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్షమని పేర్కొంటూ చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అన్నారు కార్యక్రమంలో నాయకులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు



# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు ఆదేశం**

**యాదాద్రి భువనగిరి మే 24 మహా** : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరి ధాన్యం సేకరణ, జొన్న, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్ష జరిపారు. వేసవి తీవ్రత, హమాలీల కొరత వంటి అనేక ప్రతీకూల పరిస్థితులు ఎదురైనప్పటికీ, లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్ళు జరపడం అభినందనీయం అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. యాసంగి - 2026 సీజన్ కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరపాల్సి ఉండగా, ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు పూర్తయ్యాయని వివరించారు. జిల్లాలలో కూడా ధాన్యం సేకరణను వేగవంతం చేసి, ఈ నెలాఖరు నాటికి అన్ని చోట్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. గడిచిన మూడు సీజన్ ల నుండి స్వతంత్ర భారత దేశంలోనే ప్రభుత్వ పరంగా రైతుల నుండి అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రభాగాన నిలుస్తోందని గుర్తు చేశారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో యాసంగిలో 8575 కొనుగోలు కేంద్రాలను నెలకొల్పి పెద్ద ఎత్తున ధాన్యం సేకరిస్తున్నామని వివరించారు. సేకరించిన వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి రైతుల ఖాతాలలో రూ.45 వేల కోట్లకు పైగా డబ్బులు జమ చేశామని అన్నారు. ధాన్యం సేకరణ తుది దశకు చేరిన దృష్ట్యా, ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ రైతుల నుండి మిగిలిన ధాన్యం నిల్వలను సైతం వేగంగా కొనుగోళ్ళు జరిగేలా కృషి చేయాలని



కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. ఒకవేళ వర్షాలకు ధాన్యం తడిసినా, దానిని ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ఈ మేరకు రైతులకు భరోసా కల్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే, నేరుగా తమ దృష్టికి తేవాలని అన్నారు. తాలు, తరుగు పేరిట ఎక్కడైనా మిల్లర్లు, ట్రేడర్లు రైతులకు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తే, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. మరో వారం రోజుల పాటు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పంట కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని హితవు పలికారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, వరి పంట కోసిన అనంతరం కొంతమంది రైతులు వరి కోయ్యలకు నిప్పు పెడుతున్నారని, ఇది పర్యావరణానికి హాని కలిగించడంతో పాటు భూసారం దెబ్బతింటుందని, ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఏర్పడుతోందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వరి కోయ్యలకు నిప్పు పెట్టకుండా రైతులకు గ్రామగ్రామాన విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, చిత్రారామచంద్రన్, దివ్య దేవరాజన్ తదితరులు ఈ నెల 25 నుంచి ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించే మహిళా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు, సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రోజువారీగా చేపట్టాల్సి ఉన్న కార్యక్రమాలను తెలియజేస్తూ, మహిళా సంక్షేమ వారోత్సవాలను నిర్వహించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, సివిల్ సప్లై అధికారి రోజా రాణి, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, సంబధిత అధికారులు పాల్గొన్నారు.




## జర్నలిస్టుల హక్కుల రక్షణకు నిరంతరం పోరాడాలి

- **అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇండ్ల స్థలాలు దక్కే వరకు అండగా ఉంటాం**
- **సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల విధులు బాధ్యతలు అత్యంత కీలకమైనవి**
- **యాజమాన్యాల తీరు మారాలి శ్రమకు తగ్గ ప్రతిఫలం అందించాలి**
- **సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**

**భద్రాద్రి బ్యూరో, మహా**: జర్నలిస్టుల హక్కుల రక్షణకు వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తృతీయ మహాసభ ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్బులో ఘనంగా జరిగింది. ఈ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల విధులు బాధ్యతలు అత్యంత కీలకమైనవని ఆయన కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఫోర్త్ ఎస్టేట్‌గా జర్నలిస్టులు పోషిస్తున్న పాత్ర అమోఘమైనదని క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లను ఇబ్బందులను ఎదుర్కొంటూ సాహసోపేతంగా విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. అయితే ప్రస్తుత తరుణంలో కొన్ని మీడియా యాజమాన్యాల తీరు మారాల్సిన అవసరం ఉందని రాత్రింబవళ్లు శ్రమించే జర్నలిస్టులకు వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సుదీర్ఘకాల సమస్య అయిన ఇండ్ల స్థలాల అంశంపై ప్రసంగించారు. అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఇండ్ల స్థలాలు దక్కే వరకు తాను వ్యక్తిగతంగా పార్టీ పరంగా పూర్తి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి హెల్త్ కార్డూ ఇండ్ల స్థలాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమాజంలో నిష్పక్షపాత వైఖరితో వార్తలు రాసినప్పుడే జర్నలిజం విలువలు కాపాడబడతాయని వృత్తిపరమైన బాధ్యతను విస్మరించవద్దని సూచించారు. జర్నలిస్టులందరూ ఐక్యతతో ముందుకు సాగాలని అప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి వారి కుటుంబాల భద్రతకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సభ్యులు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.




## వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలి

- **ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శనకు బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు**
- **బిజెపి జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య**

**ఆలేరు మే 24 మహా** : ధాన్యం కొనుగోలు వేగవంతం కా కపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని యుద్ధ ప్రాతిపదికన వడ్ల కొనుగోలు జరపాలని యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి కార్యదర్శి కాదురీ అచ్చయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ మేరకు ఆలేరులోని బిజెపి కార్యాలయం లో ఆదివారం బిజెపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు ఇప్పటివరకు మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో 30% ఒడ్లు కొనుగోలు కాలేదని ఆయన ఆరోపించారు కొనుగోలు అయిన ఒడ్లకు లారీలు రాక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఈ నేపథ్యంలో ఈనెల 26న హైదరాబాదు నుండి బిజెపి ఎంపీలు ఎమ్మెల్యేలు బస్సు యాత్ర ద్వారా బయలుదేరి భువనగిరి,ఆలేరు నియోజకవర్గాలోనీ పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించనున్నారని ఆయన వివరించారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయకపోతే బిజెపి పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా నాయకులు రచ్చ శ్రీనివాస్, వడ్డేమాను నరేందర్, చిరిగే శ్రీనివాస్, జంపాల శ్రీనివాస్, ఆలేరు మండల బిజెపి అధ్యక్షులు పూజారి కుమార్, ఆలేరు యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షులు గంగేష్ కర్రే ప్రవీన్, కిసాన్ మోర్చా నాయకులు హనుమంతు, మహేందర్ తదితరులు ఉన్నారు.

## పెద్దంపేటలో మట్టి దోపిడీ

**రామగుండం, మహా** : పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం అంతర్గాం మండలం పెద్దంపేట్ గ్రామంలోని రచ్చగుట్టకు సంబంధించిన మట్టిని అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తుండటంపై పెద్దంపేట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అనుమతులు లేకున్నా, సుమారు పదివేల లారీల మట్టిని దౌర్జన్యంగా రోడ్డు విస్తరణ మరియు రైల్వే ట్రాక్ పనుల కోసం తరలిస్తుండటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.అధికారుల నిర్లక్ష్యంపై నిరసన మట్టి తరలింపును అరికట్టాలని గ్రామస్తులు అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. పైగా గ్రామ అవసరాల కోసం ఎవరైనా అనుమతులు కోరితే జాప్యం చేస్తూ, అక్రమ రవాణాకు మాత్రం సహకరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే చారిత్రక రచ్చగుట్ట కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. దీనిపై గ్రామస్తులు ఇప్పటికే కోర్టు ద్వారా సంబంధిత అధికారులకు లీగల్ నోటీసులు పంపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆముల పెద్ద శ్రీనివాస్, ఉప సర్పంచ్ కరివేద స్రవంతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కొలిపాక శరణ్య మధుకర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పుట్ట శ్రీనివాస్ యాదవ్, గౌడ సంఘం మాజీ అధ్యక్షులు మెరుగు రమేష్‌గౌడ్, బండి మహేష్ గౌడ్, కోల మధుకర్ పటేల్, గోలి ప్రకాష్, గుడి రమేష్ రెడ్డి, తరుణ్ మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామాజీపేట పత్తి విత్తనాల కంపెనీ వద్ద గోదాముకు పరిశీలన

**ప్రభుత్వ విప్ బీర్ల భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి**

**యాదాద్రి భువనగిరి మే 24 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని రామాజీపేట గ్రామంలో ఉన్న పత్తి విత్తనాల కంపెనీని వడ్ల గోదాం గా మార్చడం కోసం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య భువనగిరి ఆర్డీవో కృష్ణ రెడ్డి, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో కలసి ఆదివారం పరిశీలించారు

రైతులు ధాన్యం నిల్వ చేసేందుకు రైతులకు ఇబ్బందులు పడకుండా ఉండాలని భావించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధికారులతో ప్రత్యేకంగా చర్చించి ఈ గోదాం ఏర్పాటుకు కృషి చేశారు. దీంతో రామాజీపేటతో పాటు పరిసర గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే నమ్మకంతో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ఇప్పటికే ఆలేరు నియోజకవర్గంలో సుమారు 85 శాతం వడ్ల కొనుగోళ్లు పూర్తయ్యాయని తెలిపారు.

ఈ గోదాం ఏర్పాటు వల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు ధాన్యాన్ని సమయానికి విక్రయించే అవకాశం లభిస్తుందన్నారూ. రైతుల కష్టాలను గుర్తించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## వడదెబ్బతో వెంకటేష్ మృతి

**కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**

**ఆలేరు మే 24 మహా** : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన కామిటీకారి వెంకటేష్(47), అలియాస్ చిన్న ఆదివారం వడదెబ్బకారణంగా మృతి చెందాడు. వెంకటేష్ ఒక ప్రైవేటు షాప్ లో పనిచేసేవాడు.మృతునికి భార్య రేఖ,కుమారుడు లోకేష్) (8),కూతురు ఐశ్వర్య(6) లు ఉన్నారు 'పేద కుటుంబానికి చెందిన వెంకటేష్ అలియాస్ చిన్న మృతి వారి కుటుంబాన్ని మరింత పేదరికంలోకి నెట్టింది.కుటుంబ పెద్ద అయినా వెంకటేష్ మరణించడంతో ఆ కుటుంబం దిక్కులేని పరిస్థితుల్లోకి మారింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- **15 ఏండ్ల తరువాత మళ్ళీ కలిసిన 2010-11 టెన్త్ క్లాస్ బ్యాచ్ స్నేహం**
- **కాలం మారింది.. వయసు పెరిగింది.. కానీ 'స్నేహం' మాత్రం అక్కడే ఆగింది!**

**యాదాద్రి భువనగిరి మే 24 మహా** : భూమి గుండ్రంగా ఉందో లేదో తెలియదు కానీ.. సరిగ్గా 15 ఏళ్ల క్రితం విడిపోయిన స్నేహాలు మాత్రం మళ్లీ ఒకే చోట కలిశాయి. మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం మానసా విద్యా మందిర్ ఉన్నత పాఠశాల కు చెందిన 201011 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అత్యంత కోలాహలంగా, భావోద్వేగాల మధ్య జరిగింది. మొదటగా బ్యాచ్ లో రోడ్డు ప్రమాదంలో మరణించిన మిత్రులు కంది శశిధర్ రెడ్డి, రావుల నాగరాజు ల చిత్రపటాలకు పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు విద్యార్థులంత కలిసి జ్యోతి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమం ప్రారంభించారు.15 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత క్లాస్‌మేట్స్ అందరూ ఒకే వేదికపైకి రావడంతో స్కూల్ రోజులు మళ్లీ కళ్లముందు కదలాడాయి.ఈ సమ్మేళనంలో విశేషం ఏమిటంటే.. ఎవరి జీవితాల్లో వాళ్లు ఉద్యోగాలు, వ్యాపారాలు, పెళ్లిళ్లతో బిజీగా ఉండి, సమాజంలో రకరకాల హోదాల్లో ఉన్నప్పటికీ.. ఇక్కడ మాత్రం అవన్నీ పక్కన పెట్టేశారు. మళ్లీ పాత రోజుల్లోకి వెళ్లిపోయి ఒకరినొకరు పేరు పేరునా పిలుచుకుంటూ.. ఆనాటి అల్లరి పనులు, క్లాస్ లీడర్ల గొడవలు, బెంచ్ వెనుక దాక్కుని తిన్న లంచ్ బాక్సుల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకుంటూ, ఈ స్నేహం జీవితాంతం ఇలాగే కొనసాగాలని మిత్రులందరూ ఒకరికొకరు హత్తుకుని ప్రతినబూనారు. గత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ, ఏరా, ఒరేయ్ అనే పిలుపులతో మళ్ళీ చిన్న పిల్లలు గా మారిపోయి, జ్ఞాపకాల గుర్తుల కోసం సెల్ఫీలు దిగుతూ రోజంతా ఎంతో ఆనందంగా గడిపారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నిమ్మ శేఖర్ రెడ్డి, సినియర్ ఉపాధ్యాయులు సామ భూపాల్ రెడ్డి, బిఎంఆర్ఎస్ అధినేత బొప్పిడి మల్లారెడ్డి,కరస్పాండ్ రాఘవేందర్ రెడ్డి ,ఎండీ మధార్, వెంకటేశం, సంతోష్,ఆనంద్,లత,నిర్మల,పూర్వ విద్యార్థులు రమేష్ రెడ్డి,లింగస్వామి,నాగరాజు, సతీష్,ఫయాజ్,సాయి, భగవాన్ రెడ్డి, నవీన్,పవన్,మదు, శశి,శ్రీకాంత్,లత, కల్యాణి, శ్రీలత,సోని, అఖిల, సౌజన్య,మౌనిక,శ్రీలత, తదితరులు పాల్గొన్నారు...

# కోకాపేటలో కళ్లు చెదిరే భవనం.. సౌత్ ఇండియాకే టాప్




హైదరాబాద్: నగర రియల్ ఎస్టేట్ రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తూ కోకాపేట ఐటీ కారిడార్‌లో 'ది స్కైవెన్' (The Skyven) పేరిట సరికొత్త లగ్జరీ రెసిడెన్షియల్ టవర్ ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థలు 'ఈఇన్‌ఫ్రా' మరియు 'పింగ్లే వెంచర్స్ & రియాల్టీ' (PVR) సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ స్కైస్క్రాపర్ 63 అంతస్తులు, 755 అడుగులు అంటే దాదాపు పావు కిలోమీటరు (233 మీటర్లు) ఎత్తుతో దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తైన నివాస భవనంగా రికార్డు సృష్టించనుంది. కేవలం ఎత్తులోనే కాకుండా, నిర్మాణంలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికతను పొందుపరిచిన దక్షిణ భారత దేశపు మొట్టమొదటి 'AIరెడీ' స్మార్ట్ బిల్డింగ్ కూడా ఇదే కావడం విశేషం. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పెంట్‌హౌస్‌లు, ఆకాశంలో విల్లా అనుభూతినిచ్చే 'స్కై విల్లాస్', లగ్జరీ 4BHK నివాసాలను అందుబాటులోకి తెస్తున్నారు. ఇక్కడ సాధారణ ప్రాజెక్టుల లాగా కాకుండా, నివాసాల సంఖ్య పరిమితంగా ఉండటం వల్ల ప్రతి నివాసికి లభించే లగ్జరీ సదుపాయాల వాటా (AmenitytoResident Ratio) చాలా ఎక్కువగా ఉంటుంది. భవన నిర్వహణ, విద్యుత్ ఆప్టిమైజేషన్, అత్యాధునిక 24x7 భద్రతా వ్యవస్థలను ఇక్కడి AI నెట్‌వర్క్ స్వయంచాలకంగా నియంత్రిస్తుంది.భవనం పైభాగంలో ఏర్పాటు చేస్తున్న 'ది ఎవరెస్ట్' రూఫ్‌టాప్ క్లబ్ ఈ ప్రాజెక్ట్‌కే ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇందులో నగర స్కైలైన్‌తో కలిసిపోయే 'ఇన్ఫినిటీ పూల్'తో పాటు, హైదరాబాద్ నివాస మార్కెట్లోనే తొలిసారిగా నక్షత్రాలను వీక్షించేందుకు 'స్టార్ అబ్జర్వేటరీ', లగ్జరీ క్లబ్‌హౌస్, స్పా, మరియు హెలిప్యాడ్ వంటి ఐదు నక్షత్రాల వసతులను కల్పిస్తున్నారు. స్థిరమైన మార్కెట్, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో దూసుకుపోతున్న హైదరాబాద్ గ్లోబల్ ప్రొఫెషనల్స్‌ను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ గగన విహారి రూపుదిద్దుకుంటోంది.




# పేటీఎంలో బ్లాక్ డీల్..

## చేతులు మారిన రూ.963 కోట్ల షేర్లు

**న్యూఢిల్లీ:** పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌లో 1.34 శాతం వాటా బ్లాక్ డీల్ ద్వారా చేతులు మారింది. గోల్డ్‌మన్ సాక్స్, సొసైటే జనరల్, సిటిగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ సహా పలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, అలాగే సుందరం మ్యూచువల్ ఫండ్, నిప్పాన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ వంటి దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు ఈ షేర్లను కొనుగోలు చేశాయి. మొత్తం 85.98 లక్షల షేర్లను ఒక్కోటి సగటున రూ.1,120.65 ధరకు కొనుగోలు చేయగా, డీల్ విలువ రూ.963.60 కోట్లకు చేరింది. ఈ షేర్లను హాంకాంగ్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీదారు ఎస్ఏఐఎఫ్ పార్ట్‌నర్స్, గురుగ్రామ్‌కు చెందిన వెంచర్ క్యాపిటల్ సంస్థ ఎలివేషన్ క్యాపిటల్‌లు విక్రయించాయి. ఈ లావాదేవీ అనంతరం వన్97 కమ్యూనికేషన్స్‌లో ఎస్ఏఐఎఫ్ పార్ట్ నర్స్ వాటా 13.43% నుంచి 12.18 శాతానికి తగ్గింది.

# ఇల్లు కొనలేమేమో!! కొనుగోలుదారుల్లో భయాలు

ఆర్థిక వ్యవస్థలో నెలకుంటున్న అనిశ్చితి, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, నానాటికీ పెరుగుతున్న జీవన వ్యయాలు.. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యుడి నుంచి మధ్యతరగతి వరకు ఎవరైనా సరే ఆచితూచి ఖర్చు చేస్తారు. కానీ, భారత రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మాత్రం ఇందుకు భిన్నమైన వైరుధ్యం కనిపిస్తోంది.ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభాల నేపథ్యంలో భవిష్యత్తులో ఇళ్ల ధరలు మరింత ఆకాశాన్ని తాకుతాయనే భయంతో, కొనుగోలుదారులు ఇప్పుడే బడ్జెట్‌ను పెంచుకుని మరీ లగ్జరీ గృహాల వైపు చూస్తున్నారు.ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో ఆర్థిక జాగ్రత్త కంటే, భవిష్యత్తులో ఇల్లు కొనలేమేమోననే భయం, మెరుగైన జీవనశైలి అనే అంశాలే రియల్టీ రంగాన్ని నడిపిస్తున్నాయి.

### ఖర్చుల భారం

ప్రస్తుతం ఎగుమతి, దిగుమతుల రంగంలో ఉన్న అంతరాయాలు నిర్మాణ రంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి పరిసరాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు, షిప్పింగ్ రీరూటింగ్, గల్ఫ్ లింక్డ్ కార్గోలపై విధిస్తున్న యుద్ధప్రమాద బీమా భారం లగ్జరీ హౌసింగ్ ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ అనారాక్ (ANAROCK) తాజా నివేదిక ప్రకారం నిర్మాణ రంగంలో పెరిగిన ఖర్చులు ఇలా ఉన్నాయి.. కంటైనర్ రవాణా ఖర్చులు: సరుకు రవాణా ఛార్జీలు, రీరూటింగ్ కారణంగా కంటైనర్‌కు అదనంగా రూ.2 లక్షల నుండి రూ.3.5 లక్షల వరకు భారం పెరిగింది. ఉక్కు ధరలు: గడిచిన కాలంలో స్టీల్ ధరలు టన్నుకు ఏకంగా 20% పెరిగి దాదాపు రూ.72,000కు చేరుకున్నాయి. దిగుమతులపై ప్రభావం: ముంబై, గురుగ్రామ్, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లోని లగ్జరీ టవర్లలో వాడే ప్రీమియం ఫిట్టింగ్స్, విదేశీ మార్బుల్స్, ప్రత్యేక నిర్మాణ సామాగ్రి ధరలు రవాణా అంతరాయాల వల్ల భారీగా పెరిగాయి. "ఇప్పుడు కొనకపోతే భవిష్యత్తులో ఈ ధరలు మన బడ్జెట్‌కు అందనంత ఎత్తుకు వెళ్లిపోతాయి" అనే ఆలోచనే వినియోగదారులను ముందడుగు వేసేలా చేస్తోంది.



### మారిన కొనుగోలుదారుల ఆలోచన

ఒకప్పుడు కేవలం పెట్టుబడి కోసమే ఇళ్లను కొనేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. ద్వంద్వ ఆదాయం (భార్యాభర్తలిద్దరూ సంపాదించే) కలిగిన పట్టణ కుటుంబాలు, ఎగువ మధ్యతరగతి వర్గాలు గృహాన్ని తమ సామాజిక హోదాకు, ఆర్థిక భద్రతకు నిదర్శనంగా భావిస్తున్నారు. ముంబై, బెంగళూరు, గురుగ్రామ్, హైదరాబాద్ నగరాల్లో కొనుగోలుదారులు కేవలం నాలుగు గోడల ఇల్లు కాకుండా విస్తారమైన పెద్ద గృహాలు, వెల్‌నెస్‌ఫోకస్డ్, గ్రీన్ ప్రాజెక్ట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఆధునిక జీవనశైలి వసతులు ఉన్న వాటికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.

### బ్రాండెడ్ బిల్డర్లకే జై!

గతంలో ప్రాజెక్టులు మధ్యలో నిలిచిపోవడం, డెలివరీ ఆలస్యం కావడం వంటి చేదు అనుభవాల దృష్ట్యా కొనుగోలుదారులు ఇప్పుడు చాలా అప్రమత్తమయ్యారు. ధర కొంచెం ఎక్కువైనా సరే, నమ్మకమైన కార్పొరేట్ బ్రాండ్ల వైపే మొగ్గు చూపుతున్నారు. దీనినే మార్కెట్ వర్గాలు 'ట్రస్ట్ ప్రీమియం' అని పిలుస్తున్నాయి. వినియోగదారులు, ల్యాండ్ ఓనర్లు ఇప్పుడు డెవలపర్ల ఆర్థిక క్రమశిక్షణ, బ్యాలెన్స్ షీట్ బలం, గత ట్రాక్ రికార్డ్‌ను నిశితంగా పరిశీలిస్తున్నారు. డీఎల్ఎఫ్, ఎంబసీ డెవలప్‌మెంట్స్, సిగ్నేచర్ గ్లోబల్ వంటి దిగ్గజ సంస్థల విక్రయాలు పుంజుకోవడానికి ఈ బ్రాండ్ ఇమేజ్, విశ్వసనీయతే ప్రధాన కారణం.

### ప్రీమియం వర్సెస్ అఫోర్డబుల్

భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు రెండుగా చీలిపోయింది. ఒకవైపు లగ్జరీ ఇళ్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుంటే, మరోవైపు అందుబాటు గృహాల అమ్మకాలు మందగించాయి. డీఎల్ఎఫ్ (డహ్లియాస్ ప్రాజెక్ట్) కేవలం ఒకే ఒక్క త్రైమాసికంలో 32 లగ్జరీ అపార్ట్‌మెంట్లను విక్రయించింది. ఎంబసీ డెవలప్‌మెంట్స్ దక్షిణ ముంబై లగ్జరీ ప్రాజెక్ట్ ప్రారంభించిన 45 రోజుల్లోనే రూ.800 కోట్ల ప్రీసేల్స్ సాధించింది. మార్కెట్ ట్రెండ్ ప్రీమియం వైపు మళ్లడంతో మహీంద్రా లైఫ్‌స్పేసెస్ వంటి పెద్ద కంపెనీలు తమ సరసమైన హౌసింగ్ ప్రాజెక్టుల విస్తరణను తగ్గించుకోవడం గమనార్హం.

# స్టాక్ మార్కెట్ అలర్ట్: 3 రోజులు నో ట్రేడింగ్

వచ్చే వారం ట్రేడింగ్ చేయడానికి ప్లాన్ చేసుకుంటున్న ఇన్వెస్టర్లు, ట్రేడర్లకు అలర్ట్. మే 25 నుండి మే 31 మధ్య భారతీయ స్టాక్ మార్కెట్లు పరిమిత రోజులు మాత్రమే పనిచేయనున్నాయి. ఈ వారంలో శని, ఆదివారాలతో పాటు అదనంగా మరో రోజు కూడా మార్కెట్లు మూతపడనున్నాయి. దీంతో మొత్తం 3 రోజుల పాటు ట్రేడింగ్ కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి.

### సెలవులు ఇలా..

కేంద్ర ప్రభుత్వం తాజాగా చంద్ర దర్శనం ఆధారంగా బక్రీద్ (ఈదుల్ అజ్హా) సెలవు దినాన్ని సవరించింది. మొదట ప్రకటించిన తేదీకి బదులుగా, మే 28 (గురువారం) నాడు అధికారిక సెలవుగా ఖరారు చేసింది. దీనిని అనుసరిస్తూ దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీలైన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (NSE), బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (BSE)లు మే 28న ట్రేడింగ్‌కు విరామం ప్రకటించాయి. ఆ తర్వాత మే 30 (శనివారం), మే 31 (ఆదివారం) వారాంతపు సెలవులు కావడంతో ఆ రోజుల్లోనూ మార్కెట్లు యథావిధిగా మూసివుంటాయి. ఫలితంగా వచ్చే వారంలో కేవలం 4 రోజులు (సోమ, మంగళ, బుధ, శుక్రవారాలు) మాత్రమే ట్రేడింగ్ సాగుతుంది.

### ఏయే విభాగాల్లో ట్రేడింగ్ బంద్?

మే 28 గురువారం నాడు బక్రీద్ సందర్భంగా మార్కెట్లోని దాదాపు అన్ని ప్రధాన విభాగాలు పనిచేయవు. ఈక్విటీ సెగ్మెంట్, డెరివేటివ్స్ సెగ్మెంట్ (F&O), కరెన్సీ డెరివేటివ్స్ సెగ్మెంట్, ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్, కమోడిటీ డెరివేటివ్స్ సెగ్మెంట్ (MCX కూడా ఉదయం సెషన్ మూసివుంటుంది)లో కార్యకలాపాలు ఉండవు.




### గత వారం ఎలా ముగిసిందంటే?

గత ట్రేడింగ్ వారంలో భారత మార్కెట్లు అత్యంత అస్థిరత మధ్య సాగినప్పటికీ, ముగింపులో సరికొత్త రికార్డుల వైపు దూసుకెళ్లాయి. నిఫ్టీ 50 (Nifty 50) గత వారంతో పోలిస్తే 1.50% వృద్ధితో 23,719 వద్ద ముగిసింది. సెన్సెక్స్ (Sensex) 1.55% వృద్ధితో 75,415 దగ్గర స్థిరపడింది. కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాల సానుకూలత, విదేశీ పెట్టుబడుల మద్దతుతో సూచీలు బలపడ్డాయి. వచ్చే వారం కేవలం నాలుగు రోజులే ట్రేడింగ్ అందుబాటులో ఉండటం, అందులోనూ గురువారం సెలవు రావడం వల్ల వీక్లీ డెరివేటివ్ కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ (Expiry) బుధవారమే (మే 27) జరిగే అవకాశం ఉంది. కాబట్టి ట్రేడర్లు తమ పొజిషన్లను ముందుగానే ప్లాన్ చేసుకోవడం, అస్థిరతను గమనిస్తూ తగిన స్టాప్‌లాస్‌లు నిర్వహించడం మంచిది.






# మంచు శివలింగం తొలి దర్శనం

అనంతనాగ్: అమర్‌నాథ్ యాత్రకు సమయం ఆసన్నమవుతోంది. జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో ఉన్న పవిత్ర గుహలో కొలువైన బాబా బర్ఫానీ (శివలింగం) తొలి దర్శనం భక్తులకు కనువిందు చేస్తోంది. ఈ అద్భుత దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శివభక్తులలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. ఈ ఏడాది ప్రతిష్టాత్మక అమర్‌నాథ్ యాత్ర జూలై 3న ప్రారంభమై, ఆగస్టు 28న రక్షాబంధన్ పర్వదినంతో ముగియనుంది. మొత్తం 57 రోజుల పాటు సాగే ఈ యాత్ర కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. యాత్ర విజయవంతానికి జూన్ 29న జ్యేష్ఠ పౌర్ణమి రోజున ప్రత్యేక 'ప్రథమ పూజ' నిర్వహించనున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కార్యాలయం ఇప్పటికే ప్రకటించింది.

**కట్టుదిట్టమైన భద్రతా వలయం**

యాత్ర నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్ అంతటా భద్రతను భారీగా పెంచారు. ముఖ్యంగా అనంతనాగ్ జిల్లాలో పహారా ముమ్మరం చేశారు. కశ్మీర్ జోన్ ఐజీపీ, డివిజనల్ కమిషనర్ అన్షుల్ గార్గ్ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, నిరంతర నిఘా ఉంచాలని ఉన్నతాధికారులు భద్రతా దళాలను ఆదేశించారు.

**మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

యాత్రకు వచ్చే భక్తుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మే 30 నాటికి అందరికీ తప్పనిసరిగా ఆర్ఎఫ్ఐడీ కార్డులు జారీ చేయాలని స్పష్టం చేశారు. బేస్ క్యాంపుల వద్ద నెట్‌వర్క్ సమస్యలు తలెత్తకుండా టెలికాం సంస్థలకు కీలక సూచనలు చేశారు. యాత్ర మార్గంలో పోనీ స్టాండ్ల నిర్మాణం, ఫెన్సింగ్, షెడ్ల వంటి మౌలిక సదుపాయాలన్నీ ఇప్పటికే సిద్ధమయ్యాయని అధికారులు తెలిపారు.

# బొద్దింకలకే భయపడుతున్నారా?..

## కేంద్రంపై విజయన్ ఫైర్!




**తిరువనంతపురం:** ప్రస్తుతం సోషల్ మీడియాలో 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) సంచలనంగా మారింది. కేవలం ఒక వ్యంగ్య రాజకీయ వేదికగా మొదలైన ఈ వేదికకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి బీజేపీ భయపడుతోందని కేరళ ప్రతిపక్ష నేత పినరయి విజయన్ ఆరోపించారు. ప్రజాస్వామ్య నిరసనలపై కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు.

**అసహనమే అధికార పక్షం ఆయుధమా?**

యువ కార్యకర్త అభిజీత్ దిప్కే స్థాపించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' అతి తక్కువ కాలంలోనే సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. కొన్ని వేదికల్లో అధికార బీజేపీ కంటే ఈ సంస్థకే ఎక్కువ మంది ఫాలోవర్లు ఉండటం గమనార్హం. ఈ క్రమంలోనే సీజేపీకి చెందిన ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను నిలిపివేయడం, చివరకు వ్యవస్థాపకుడు అభిజీత్ వ్యక్తిగత ఖాతాను కూడా సస్పెండ్ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**నిరసనను అణచివేసే ప్రయత్నం**

తమను 'బొద్దింకలు'గా పిలుచుకుంటూ చేపట్టిన ఈ నిరసనను కేవలం ఒక సాధారణ స్పందనగా కొట్టిపారేయకూడదని పినరయి విజయన్ పేర్కొన్నారు. తన ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా స్పందించిన ఆయన, కేంద్రం అనుసరిస్తున్న నిరంకుశ ధోరణిని ఎండగట్టారు. ఇలాంటి వ్యంగ్య రాజకీయ ప్రయోగాలను చూసి అధికార పక్షం కంగారుపడటం, భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన హెచ్చరించారు.

**అంతర్జాతీయ స్థాయికి 'బొద్దింక' పోరు**

భారతదేశంలో మొదలైన ఈ 'కాక్రోచ్' ట్రెండ్ ఇప్పుడు సరిహద్దులు దాటుతోంది. ఈ సంస్థపై సైబర్ దాడులు, పోలీసు హెచ్చరికలు, విదేశీ ప్రమేయం ఉందన్న ఆరోపణలు వస్తున్నా, ప్రజాదరణ తగ్గడం లేదు. ముఖ్యంగా ఇలాంటి వినూత్న నిరసనలు భారత్ నుంచే కాకుండా పాకిస్తాన్ వంటి పొరుగు దేశాల్లో కూడా కొత్త రాజకీయ కదలికలకు దారితీస్తుండటం విశేషం.

# అందుకే విజయ్ గెలిచారు: స్టాలిన్

**చెన్నై:** తమిళనాడులో రాజకీయం వేడెక్కింది. టీవీకే విజయ్ ప్రభుత్వంపై డీఎంకే అధినేత, మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వం పూర్తి ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తిచేయలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం కేవలం డీఎంకే దయతోనే నడుస్తోందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాన్ని స్టాలిన్ ఒక రాజకీయ పవనంగా కాకుండా 'సినిమా సునామీ'గా అభివర్ణించారు. ఓటర్లు రాజకీయ విశ్వాసంతో కాకుండా, ఒక ప్రముఖ సినీ నటుడిపై ఉన్న ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు ఇచ్చారని ఆయన వాదించారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఆదివారం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ..'తమ అభిమాన నటుడు విజయ్ ఒక పార్టీని ప్రారంభించాడనే ఉత్సాహంతో ప్రజలు ఓటు వేశారు. కొద్ది రోజుల్లోనే ఈ ఆటబొమ్మపై వారికి ఆసక్తి పోతుంది. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్లే, ఓటర్లు చివరికి మళ్లీ డీఎంకే కోసం వెతుకుతారు' అని జోస్యం చెప్పారు. అలాగే, టీవీకే నేతృత్వంలోని ప్రభుత్వానికి స్థిరత్వం లేదు. విజయ్ పార్టీ సొంతంగా 118 సీట్ల మెజారిటీ మార్కును దాటడంలో విఫలమైంది. వారు కనీసం మెజారిటీ కూడా సాధించలేకపోయారు. తమిళనాడు ప్రభుత్వం మా దయ వల్లే మనుగడ సాగిస్తోంది. ఏ క్షణంలోనైనా, ఏ రోజైనా అది కూలిపోవచ్చు. ఏం జరుగుతుందో వేచి చూద్దాం. కచ్చితంగా ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగదు' అంటూ బాంబు పేల్చారు. ఇదే సమయంలో అన్నాడీఎంకే రాజకీయాలను ప్రస్తావిస్తూ.. అన్నాడీఎంకేను చీల్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. కానీ, అవన్నీ విఫలమయ్యాయని స్టాలిన్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాజకీయ పరిస్థితి అస్థిరంగా ఉందని పేర్కొన్నారు. మిత్రపక్షాలకు మద్దతు ఇవ్వడం గురించి ప్రస్తావిస్తూ, కమ్యూనిస్టు పార్టీలు, విదుతలై చిరుతైగళ్ కచ్చి (వీసీకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) వంటి పార్టీలు మొదట్లో టీవీకే ప్రభుత్వానికి బయటి నుంచి మాత్రమే మద్దతు ఇచ్చాయి. కానీ, ఆ తర్వాత మంత్రివర్గంలో చేరాయని ఆయన పేర్కొన్నారు. ఇక, ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 సీట్లతో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. 234 మంది సభ్యులున్న సభలో మెజారిటీ మార్కుకు అది కొద్దిలో ఆగిపోయింది. ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఐయూఎంఎల్, వీసీకే పార్టీలు డీఎంకే నేతృత్వంలోని కూటమిలో భాగంగా పోటీ చేశాయి. అయితే, ఫలితాలు వెలువడిన కొద్దిసేపటికే ఐదు సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ కూటమి నుంచి బయటకు వచ్చి టీవీకేకు మద్దతు ప్రకటించింది. రాష్ట్రంలో తన తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సంపాదించే ప్రయత్నంలో విజయ్‌కు వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు ఇచ్చాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 133 స్థానాలు గెలుచుకున్న డీఎంకేకు ఈ ఎన్నికలు పెద్ద ఎదురుదెబ్బగా మారాయి. ఈసారి ఆ పార్టీ కేవలం 59 స్థానాలకే పరిమితమైంది. స్టాలిన్ స్వయంగా కొలత్తూరు నియోజకవర్గం నుంచి ఓటమి చవిచూశారు.






# ఎబోలా కలకలం.. కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ:** ఆఫ్రికా ఖండంలోని డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో ఎబోలా వైరస్ మహమ్మారి విలయతాండవం చేస్తోంది. ప్రాణాంతకమైన 'బుండిబుగ్యో' రకం ఎబోలా వైరస్ వేగంగా వ్యాపిస్తుండటంతో, భారత కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. ఈ దేశాలకు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని భారత పౌరులను హెచ్చరించింది.

**అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితి**

ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 17న, ఈ ఎబోలా వ్యాప్తిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్'గా ప్రకటించింది. అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనల ప్రకారం ఈ వైరస్ ముప్పు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (ఆఫ్రికా సీడీసీ) సైతం, దీనిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ కాంటినెంటల్ సెక్యూరిటీ'గా పేర్కొంటూ కఠిన నిఘా ఉంచాలని సూచించింది.

**ఎబోలా వ్యాప్తి ఎలా జరుగుతుంది?**

ఎబోలా అత్యంత ప్రమాదకరమైన వైరల్ వ్యాధి. ఇది సోకిన వ్యక్తుల రక్తం, వాంతులు, వీర్యం, చెమట, ఇతర శరీర ద్రవాలతో నేరుగా సంబంధం ఏర్పడినప్పుడు ఇతరులకు వేగంగా వ్యాపిస్తుంది. ఒకసారి వైరస్ సోకిన తర్వాత, వ్యాధి తీవ్రత చాలా వేగంగా పెరుగుతుంది. సకాలంలో సరైన చికిత్స అందకపోతే, ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## గుర్తించాల్సిన లక్షణాలు


ఈ వ్యాధి సోకిన వారిలో జ్వరం, తీవ్రమైన నీరసం, కండరాల నొప్పులు, వాంతులు, విరేచనాలు ప్రధాన లక్షణాలుగా కనిపిస్తాయి. వ్యాధి తీవ్రత పెరిగేకొద్దీ, శరీరంలో అంతర్గత లేదా బాహ్య రక్తస్రావం జరగవచ్చు. ఈ లక్షణాలు ఏమాత్రం కనిపించినా, వెంటనే వైద్య సహాయం పొందడం అత్యవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయా దేశాలకు వెళ్లే భారతీయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | సోమవారం, హైదరాబాద్ | 25-05-2026
ANN తెలుగు



# మహేష్ ఫ్యామిలీ నుంచి మరో హీరోయిన్..?

సినిమా ఇండస్ట్రీలో సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీకి ఉన్న క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. ఇక ఆయన వారసుడిగా సినీరంగంలోకి అడుగుపెట్టిన మహేష్ బాబు ఇప్పుడు అత్యధిక ఫాలోయింగ్ సంపాదించుకున్న సంగతి తెలిసిందే. బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ అందుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. త్రూ అవుట్ ఇండియాలోనే వన్ ఆఫ్ ది టాప్ రేటెడ్ ఫిల్మ్ స్టార్ గుర్తింపు పొందాడు. పాన్ ఇండియా.. పాన్ వరల్డ్ స్థాయిలో.. జక్కన్న అప్ కమింగ్ సినిమాతో హాట్ టాపిక్ అవుతున్నాడు. వారణాసి అనే టైటిల్ తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదలకానుంది. ఈ సినిమాను పాన్ వరల్డ్ గా రిలీజ్ కానుంది. ఇక ఈ క్రమంలోనే కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో తరం సినిమాల్లోకి వచ్చేందుకు రెడీ అవుతోంది. మహేష్ పిల్లలు గౌతమ్.. సితార సినిమాల్లోకి తొందర్లో రావడం పక్కా అనే టాక్ వస్తోంది. ఇక వీరితో పాటు సుధీర్ బాబు అబ్బాయి కూడా.. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతున్నాడు. అలాగే ఇప్పుడు మహేష్ బాబు అన్న రమేష్ బాబు కొడుకు జయకృష్ణ కూడా హీరోగా పరిచయం అవుతున్నాడు. శ్రీనివాస మంగాపురం సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు జయకృష్ణ.



# బికినీ ఫొటోలపై డ్రాగన్ హీరోయిన్ ఆగ్రహం

కన్నడ హీరోయిన్ రుక్మిణి వసంత్ పేరు చెప్పగానే సంప్రదాయ పాత్రలే గుర్తొస్తాయి. అలాంటిది ఈమె స్విమ్మింగ్ పూల్‌లో బికినీ ధరించి ఫొటోషూట్ చేసిందని చెప్పి ఓ వీడియోతో పాటు కొన్ని ఫొటోలు వైరల్ అయ్యాయి. నిజంగానే రుక్మిణి ఇలా చేసిందా అని అంతా అనుకున్నారు. ఇప్పుడు సదరు బికినీ పిక్స్ పై స్వయంగా రుక్మిణినే క్లారిటీ ఇచ్చింది. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. 'ఏఐ సాయంతో సృష్టించిన నా ఫొటోలు ఆన్‌లైన్‌లో వైరల్ కావడం నేను, నా టీమ్ గుర్తించాం. అవన్నీ ఫేక్. ఏఐతో తయారు చేశారని క్లారిటీ ఇస్తున్నాను. ఇలాంటివి క్రియేట్ చేయడం నిజంగా బాధ్యతారాహిత్యమే. అలానే మా వ్యక్తిగత గోప్యతని ఉల్లంఘించడమే అవుతుంది. దీన్ని నేను తీవ్రంగా పరిగణిస్తున్నాను. ఫొటోలని సృష్టించిన వాళ్లతో పాటు, సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న వారిపై సైబర్ క్రైమ్ ద్వారా చర్యలు మొదలుపెట్టాం. ఇలాంటి వాటిని పోస్ట్ చేయడం, షేర్ చేయడం లాంటివి మానుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని రుక్మిణి చెప్పుకొచ్చింది. రీసెంట్ టైంలో ఇలా జరగడం మరీ ఎక్కువైపోయింది. గతంలో పలువురు ఫొటోగ్రాఫర్లు.. వెనక వైపు నుంచి, అసభ్యకర యాంగిల్స్‌లో ఫొటోలు తీస్తున్నారని రుక్మిణితో పాటు పలువురు కన్నడ హీరోయిన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడిలా జరిగింది. యాంకర్ అనసూయకి కూడా ఇలానే జరగడంతో కేసు పెట్టింది.రుక్మిణి సినిమాల విషయానికొస్తే.. కన్నడలో చేసిన 'సప్త సాగర ఎల్లో దాచే' రెండు భాగాలతో పాటు 'కాంతార' సీక్వెల్ ఈమెకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. ప్రస్తుతం ఎన్టీఆర్‌తో 'డ్రాగన్'లో నటిస్తోంది. వచ్చే ఏడాది జూన్ 11న ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది.

# సినీ ఇండస్ట్రీ అసభ్యకరమని భయపెట్టారు..

ఉల్లాసంగా ఉత్సాహంగా, కరెంట్ వంటి చిత్రాలతో తెలుగులో మంచి పేరు, గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ స్నేహ ఉల్లాల్. అయితే ఆమె కెరీర్ మొదలైంది మాత్రం హిందీ సినిమాతోనే.. లక్కీ: నో టైమ్ ఫర్ లవ్ (2005) చిత్రంతో వెండితెరపై తన ప్రయాణం ఆరంభించింది. ఒక్క సినిమాతోనే తన దశ తిరిగిపోయింది. తెలుగు, హిందీలో వరుస ఆఫర్లు అందుకుంది. మధ్యలో సినిమాలు వదిలేసింది. 16 ఏళ్లకే ఎంట్రీరెండేళ్ల క్రితమే మళ్లీ రీఎంట్రీ ఇచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్నేహ ఉల్లాల్ ఆసక్తికర విషయాలు పంచుకుంది. 'నేను సినిమాల్లో అడుగుపెట్టే సమయానికి నా వయసు 16 ఏళ్లే! అప్పుడే పదో తరగతి పూర్తి చేసి కాలేజీలో చేరాను. అక్కడ సల్మాన్ సోదరి అర్పిత ఖాన్ ఫ్రెండ్స్ నన్ను చూశారు. వారు లక్కీ సినిమా ఆడిషన్స్‌కు వెళ్లారు. బహుశా ఆ సమయంలోనే నా గురించి చెప్పి ఉంటారు.

## అమ్మకు క్యాన్సర్

అలా ఆ మూవీ టీమ్ నన్ను కలిసింది. ఆ సమయంలో మా ఇంట్లో పరిస్థితి బాగోలేదు. అమ్మ క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటోంది. అందరి ముఖంలోనూ విషాదమే ఉంది. ఈ సినిమా ఛాన్స్ ద్వారా అందరికీ కాస్త ఉపశమనం కలిగించాలనుకున్నాను. పైగా అమ్మకు ప్రయాణాలంటే భలే ఇష్టం. షూటింగ్స్ కోసం తనను వెంట తీసుకుని వెళ్లొచ్చని సినిమా ఒప్పుకున్నాను.

## చాలా కోల్పోయా..

ఈ మూవీ రిలీజయ్యాక నాపై బోలెడంత ప్రేమ కురిపించారు. ఈ ఇండస్ట్రీ నాకెంతిచ్చిందో అంతకంటే ఎక్కువే తీసుకుంది. నా కాలేజీ లైఫ్, స్వేచ్ఛను హరించేసింది. 16 ఏళ్ల నుంచి సడన్‌గా పెద్దదాన్నయిపోయాను. టీనేజ్‌ను మిస్ అయ్యాను. అయితే చిన్నప్పటి నుంచే నాకు చాలా ఆఫర్లు చచ్చాయి. ఒమన్ నుంచి భారత్‌కు వచ్చిన ప్రతిసారి ఏదో ఒక వాణిజ్య ప్రకటనలో నటించమని అడిగారు.

## ఆ భయంతో దూరం

కానీ ఇండస్ట్రీపై ఉన్న భయంతో వాటిని దూరం పెట్టాను. ఇంట్లోవాళ్లు కూడా ఇండస్ట్రీ అసభ్యకరంగా ఉంటుందని భయపెట్టారు. పైగా నేనంత గ్లామర్‌గా కూడా ఉండనని నా అభిప్రాయం. అందుకే ఎక్కువ సినిమాలు చేయలేదు. ఇప్పుడు మంచి పాత్రలు ఎంచుకుని మళ్లీ బాలీవుడ్‌లో బిజీ అవాలని ఉంది' అని స్నేహ ఉల్లాల్ చెప్పుకొచ్చింది.





# ప్రామిస్.. అలా పెళ్లి చేసుకోను : కంగనా క్లారిటీ

బాలీవుడ్ నటి కంగానా రనౌత్‌కు సంబంధించిన ఓ వీడియో గత రెండు రోజులుగా నెట్టింట చక్కర్లు కొడుతోంది. అందులో కంగనా మెడలో నల్ల పూజల దండా, చేతికి మట్టిగాజులు ఉన్నాయి. దీంతో ఆమె రహస్యంగా పెళ్లి చేసుకుందంటూ కొంతమంది ఆ వీడియోని షేర్ చేస్తున్నారు. తాజాగా దీనిపై కంగనా స్పందించింది. తనకు సీక్రెట్ పెళ్లి చేసుకునే అవసరం లేదని, ఒకవేళ పెళ్లి చేసుకునే ఆలోచన ఉంటే కచ్చితంగా అందరికి చెప్పే చేసుకుంటానని తనదైన శైలీలో ఇన్‌స్టా స్టోరీలో బదులిచ్చింది. 'నేను ఓ సినిమా షూటింగ్‌లో ఉన్నప్పుడు ఆ వీడియో,ఫోటో తీశారు. అది సినిమాలో నా క్యారెక్టర్. అది చూసి చాలా మంది నాకు కాల్స్ చేస్తున్నారు. పెళ్లి చేసుకున్న మహిళగా నటించాను. అందులో తప్పేముంది? నటీనటులు అన్నాక అన్ని పాత్రలు చేయాలి. రహస్యంగా పెళ్లి చేసుకోవాల్సిన అవసరం నాకు లేదు. ఒకవేళ పెళ్లి చేసుకుంటే అందరికి చెప్పే చేసుకుంటా. ఇది నా ప్రామిస్' అని కంగనా చెప్పుకొచ్చింది. కంగనా ప్రస్తుతం క్వీన్ మూవీ సీక్వెల్‌లో నటిస్తోంది. 'క్వీన్'లో వివాహం రద్దయి విదేశాలకు వెళ్లిన మహిళగా కనిపించిన కంగనా.. సీక్వెల్‌లో పెళ్లైన మహిళగా కనిపించబోతున్నట్లు వీడియో చూస్తే అర్థమవుతుంది.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com